




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

RNI : TELTEL/2021/80267

సంపుటి: 5 సంచిక: 330, పేజీలు - 08

బుధవారం, మే 20, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## పాలమూరు - రంగారెడ్డిని

# యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

- ఇతర ప్రాజెక్టుల విషయంలోనూ భూసేకరణ పూర్తిచేయాలి
- భూ సేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకూడదు
- ఉమ్మడి మహబూబ్ నగర్ నేతల సమావేశంలో సీఎం రేవంత్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల విషయంలో కూడా భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులతో ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఈ సందర్భంగా కీలకమైన సూచనలు చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రాజెక్టుల భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. పెండింగ్ బిల్లులను చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని



ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాజేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులు పాల్గొన్నారు.

## దేశంలో ఆర్థిక తుఫాను రాబోతోంది

- సామాన్యులకు ఇబ్బంది తప్పదన్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ ఆర్థిక పరిస్థితిపై లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో ఆర్థిక తుఫాను రాబోతోందని, ప్రజలందరూ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనక తప్పదని బాంబు పేల్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చబోతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. సామాన్యుల ఆర్థిక భారం మోయక తప్పదని బిలియనీర్లకు అనుకూలంగా ఆర్థిక వ్యవస్థను మోదీ మార్చేశారని ఆరోపించారు. గత కొద్ది రోజులుగా ఈ విషయమే తాను ప్రజలకు వివరిస్తున్నానని తెలిపారు. ప్రధాని ఆర్థిక విధానాలతోనే దేశానికి ఈ దుస్థితి రాబోతుందని రాహుల్‌గాంధీ ఆరోపణలు చేశారు. ప్రధాని ఐదు దేశాల పర్యటనపై రాహుల్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు వల్ల అంబానీ, అదానీలకు ఏమీకాదని, సామాన్యులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటారని అన్నారు. సంక్షోభ సమయంలో విదేశీ ప్రయాణాలు



మానుకోవాలని ప్రజలకు చెబుతున్న మోదీ తాను మాత్రం ప్రపంచమంతా పర్యటిస్తున్నారని దుయ్యబట్టారు. "ఆయన రాజభవనాల్లో కూర్చుంటారు. యువత, ప్రజలు ఇబ్బందులు పడతారు రాబోయే ఆర్థిక సంక్షోభం అదానీ,

2లో..

## బండి భగీరథ్ కేసులో

# మరో సిట్ ఏర్పాటు

- బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం
- మరో సిట్ ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సోషల్ మీడియా పోస్టులపై కొత్త సిట్ దర్యాప్తు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గత కొన్ని రోజులుగా తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా బండి భగీరథ్ పోక్సో కేసు చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. మీడియా కంటే ముందే ఈ కేసు, దానికి సంబంధించిన విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బండి భగీరథ్ ఫోటోలు, వీడియోలు, ఆడియోలు, చాటింగ్‌లు ఇవి అంటూ తెగ వైరల్ చేశారు. ఈ క్రమంలోనే కొందరు మైనర్ అయిన బాధితురాలి ఫొటోలు, వీడియోలను కూడా సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో స్పందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కేసులో కఠిన దర్యాప్తు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేయగా.. బండి భగీరథ్‌ను లొంగిపోయారు.

2లో..

## వాట్సాప్ మీసేవలో మరిన్ని

# జీహెచ్ఎంసీ సేవలు

- కొత్తగా అందుబాటులోకి 9 పౌర సేవలు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రప్రభుత్వం వాట్సాప్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పరీక్షా ఫలితాలతోపాటు పలు సేవలను వాట్సాప్ ద్వారా తెలంగాణ పౌరులు పొందుతున్న సంగతి తెలిసిందే. తాజాగా జీహెచ్ఎంసీకి సంబంధించిన పౌర సేవలను కొత్తగా మీసేవ వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత సౌకర్యం,

2లో..

## తీరం మనదే..

# బోటు మనదే.. వేటా మనదే

- మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్‌లా వ్యవహరిస్తా
- వేట నిషేధ సమయంలో రూ. 262 కోట్ల ఆర్థిక సాయం
- మత్స్యకార మహిళల కోసం సీవీడ్ సాగు, 60% సబ్సిడీపై 200 మెకనైజ్డ్ బోట్లు
- మన జలాల్లో గస్తీ పెంచి ఇతర రాష్ట్రాల బోట్లను అడ్డుకుంటామని హామీ






అమరావతి (ప్రశ్న న్యూస్) "చేపలు పట్టడమే కాదు, వాటిని అమ్ముకోవడంలోనూ మత్స్యకారులకు అండగా ఉంటాను. మీ ఉత్పత్తులకు మంచి ధర వచ్చేలా, ప్రపంచవ్యాప్తంగా గిరాకీ సృష్టించేలా ఒక మార్కెటింగ్ మేనేజర్‌లా నేను వ్యవహరిస్తాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. చేపలు మంచి పౌష్టికాహారమని, ప్రోటీన్లు అధికంగా ఉండే ఈ ఆహారానికి ప్రపంచవ్యాప్తంగా

2లో..

# ఏపీలోని గ్రామాల్లో క్షేత్రస్థాయి సర్వే

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం
- గ్రామాల్లో పంచాయతీ భూములు గుర్తించాలని ఆదేశం

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం అత్యంత పారదర్శకంగా క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు? ఇంకా ఎలాంటి అవసరాలు ఉన్నాయనే వివరాలతోపాటు పంచాయతీ భూములు, పోరంబోకు స్థలాలు, పశువుల మేత మైదానాలు, స్మశానవాటికల పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ సర్వే నివేదికల ఆధారంగా గ్రామాల్లో భూములకు రక్షణ కల్పించడంతోపాటు ప్రతి గ్రామం స్వయం సమృద్ధి

2లో..



## తెలంగాణ నిరుద్యోగులకు

# భారీ ఊరట

- ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితి 44కు పెంపు!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న లక్షల మంది నిరుద్యోగులకు రేవంత్ సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ సర్వీస్‌ల్లో ప్రత్యక్ష నియామకాల కోసం నిర్దేశించిన గరిష్ట వయోపరిమితిని మరో 10 ఏళ్లపాటు పెంచుతూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు జీవో జీవో నెంబర్ 86 నుంచి విడుదల చేశారు.

**44 ఏళ్ల వరకు ఓసీ అభ్యర్థులు ఉద్యోగాలకు అప్లై చేయవచ్చు**

ఈ నిర్ణయంతో ఇప్పటి వరకు 34 ఏళ్లుగా ఉన్న గరిష్ట వయోపరిమితి ఇప్పుడు 44 ఏళ్లకు చేరుకుంది. ఈ పెంపు కేవలం ఒక ఏడాదిపాటు అమలులో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పుడు కొత్తగా వచ్చిన జీవో ప్రకారం ఓసీ అభ్యర్థులు 44 ఏళ్ల వరకు ప్రభుత్వ

2లో..

## దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్

- హైదరాబాద్‌లోనే 16 వేల దుకాణాలు మూసివేత
- ఆన్‌లైన్ ఫార్మసీలకు వ్యతిరేకంగా సమ్మె



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆన్‌లైన్‌లో మెడిసిన్ అమ్ముకోవచ్చు అంటూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన కొత్త నిబంధనల పట్ల ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ (ఏఐఓసీడీ) తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. వెంటనే ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్

2లో..

## ప్రమాదకరమైన వీధి కుక్కలకు కారుణ్యమరణం

- సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) వీధి కుక్కల స్వైరవిహారం, కుక్క కాట్ల మరణాలపై సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన, సంచలన తీర్పును వెలువరించింది. ఈ సమస్యపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం మంగళవారం నాడు రాష్ట్ర ప్రభుత్వాలకు, మున్సిపల్ అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడులు నిత్యకృత్యంగా మారి, పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతున్న ఉదంతాలపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ప్రజలు, ముఖ్యంగా పసిపిల్లలు, వృద్ధులు, విదేశీ పర్యాటకులు కుక్క కాట్లకు గురవుతుంటే ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించరాదు అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. గౌరవప్రదంగా, భయం లేకుండా బతికే హక్కు ప్రతి పౌరుడికి ఉందని గుర్తు చేస్తూ వీధి కుక్కల నియంత్రణలో విఫలమైన రాష్ట్రాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ తీర్పులో అత్యంత కీలకమైన అంశం ఏంటంటే పిచ్చి పట్టిన, నయం చేయలేని వ్యాధులతో బాధపడుతున్న లేదా అత్యంత ప్రమాదకరంగా మారి మనుషులపై దాడులు చేస్తున్న కుక్కలను చంపేయడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం, పశువైద్యుల పర్యవేక్షణలో అటువంటి

2లో..

# ఇన్‌స్టాగ్రామ్‌తో ఇన్‌ఫ్లుయెన్స్ చేసి సీఎం అయ్యారు

- టీవీకే విజయం పట్ల స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు

చెన్నై (ప్రశ్న న్యూస్) ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పిల్లలను ఇన్‌ఫ్లుయెన్స్ చేసి సీఎం అయ్యారు అంటూ తమిళనాడు సీఎం, టీవీకే చీఫ్ జోసెఫ్ విజయ్‌పై డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ సెటైర్లు వేశారు. తంజావూర్‌లోని ఓ వివాహ రిసెప్షన్లో పాల్గొన్న ఆయన 'విజయ్ పార్టీకి సరైన (పోలింగ్) బూత్ ఏజెంట్లు కూడా లేరు. కానీ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పిల్లలను ప్రభావితం చేసి సీఎం అయ్యారు' అని వ్యాఖ్యానించారు. సమాజంపై సోషల్ మీడియా ఎంతటి ప్రభావం చూపుతుందో అంచనా వేయడంలో తాము విఫలమైనట్లు ఈ వ్యాఖ్యల ద్వారా మాజీ సీఎం అంగీకరించినట్లయ్యింది. "సోషల్ మీడియాను, ఇన్‌స్టాగ్రామ్‌ను ఉపయోగించి పిల్లల ద్వారా వారి తల్లులు, అమ్మమ్మ నానమ్మలు, పెద్దలను ప్రభావితం





చేసేలా ప్రచారం చేయించారు. దాన్ని గమనించడంలో మేం విఫలం అయ్యాం" అని డీఎంకే అధినేత స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఇకపై ఇలాంటి చర్యలను తిప్పికొట్టేందుకు పార్టీ కొత్త వ్యూహాలను రూపొందిస్తుందని ఆయన తెలిపారు. అయితే అధికారాన్ని కోల్పోయినప్పటికీ డీఎంకే

2లో..

# దేశంలో ఆర్థిక తుఫాను రాబోతోంది

అంబానీలను గానీ, ప్రధానమంత్రిని గానీ ప్రభావితం చేయదు కానీ సామాన్య ప్రజలనే ఇది తీవ్రంగా దెబ్బతీస్తుంది" ఆయన హెచ్చరించారు. మునుపెన్నడూ చూడని సంక్షోభానికి దారితీస్తుందని, కష్టకాలం ముందుందని రాహుల్ గాంధీ హెచ్చరించారు.రాహుల్ గాంధీ తన సొంత నియోజకవర్గం రాయబరేలీలో రెండు రోజుల పర్యటన కోసం మంగళవారం చేరుకున్న రాహుల్ స్థానిక చురువా హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మోదీపై ఆయన విరుచుకుపడ్డారు. అయితే, వచ్చే యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో అఖిలేష్ యాదవ్‌తో పొత్తులపై మీడియా ప్రశ్నించగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుదల వంటివి ప్రధాన అంశాలని నొక్కిచెబుతూ, కీలక సమస్యల నుంచి దృష్టి మళ్లించాలనుకోవడం లేదని ఆయన అన్నారు.ఇక, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐదు దేశాల పర్యటనలో భాగంగా మంగళవారం ఇటలీలో పర్యటించనున్నారు. ఆయన ఇప్పటివరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే దేశాల్లో పర్యటించారు. ఇటలీతో మోదీ విదేశీ పర్యటన ముగుస్తుంది. ఆయన బుధవారం స్వదేశానికి చేరుకుంటారు. హార్మూజ్ జలసంధి మూసివేత కారణంగా భారత్ సప్లయ్ చైన్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న వేళ ఈ పర్యటనలో దీర్ఘకాలిక ఇంధన భద్రతను సాధించడం, హరిత ఇంధన ప్రత్యామ్నాయాలకు మారడం, పటిష్టమైన సరఫరా గొలుసులను నిర్మించడం, రక్షణ సంబంధాలను బలోపేతం చేయడం వంటి ఇతర కీలక కార్యక్రమాలపై మోదీ దృష్టి సారించారు. అయితే, ఆయన పొదుపు చర్యల గురించి ప్రజలకు పిలుపునిచ్చి.. విదేశీ పర్యటనలకు వెళ్లడం ఏంటి? అని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

# తీరం మనదే.. బోటు మనదే.. వేటా మనదే

డిమాండ్ ఉందని, ఈ అవకాశాన్ని మన మత్స్యకారులకు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. కేవలం వేటకే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతికతతో, కొత్త ఆదాయ మార్గాలతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం, తుమ్మలపెంట గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా, చేపల వేట నిషేధ కాలానికి గాను 1,30,796 మత్స్యకార కుటుంబాలకు, ఒక్కొక్కరికి రూ. 20,000 చొప్పున మొత్తం రూ. 261.50 కోట్ల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి వారి ఖాతాల్లోకి జమ చేశారు. సీఎం ప్రసంగిస్తుండగానే లబ్ధిదారుల ఫోన్లకు డబ్బులు జమ అయినట్లు సందేశాలు రావడంతో వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

### మత్స్యకారుల హక్కులు, వనరులపై పూర్తి అధికారం

"ఈ తీరం మనది, ఈ బోటు మనదే, ఇక్కడి సంపద కూడా మనదే. ఈ విషయంలో ఎలాంటి రాజీ లేదు," అని ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టిగా చెప్పారు. మన సముద్ర జలాల్లోకి పొరుగు రాష్ట్రాల బోట్లు వస్తే సహించేది లేదని, తీరప్రాంతంలో గస్తీ పెంచి మత్స్యకారుల హక్కులను కాపాడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండుగా ఉన్నాయని, ఆ నీటి వనరుల్లో చేపల పెంపకం చేసుకునే హక్కును మత్స్యకారులకే కట్టబెట్టామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిష్ సీడ్ అందించాలని మత్స్యశాఖను ఆదేశించినట్లు వెల్లడించారు. మత్స్యకారుల వేటను సులభతరం చేసేందుకు, 60 శాతం సబ్సిడీతో 200 కొత్త మెకనైజ్డ్ బోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

### మహిళల ఆర్థిక స్వావలంబనకు సీవీడ్ సాగు

మత్స్యకార పురుషులతో పాటు, మహిళల ఆర్థిక సాధికారతకు కూడా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. మత్స్యకార, డ్వాక్రా సంఘాల మహిళలకు అదనపు ఆదాయం కల్పించే లక్ష్యంతో 'సీవీడ్' (సముద్రపు నాచు) సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సీఎస్ఎంసీఆర్ఐ సహకారంతో మహిళలకు సీవీడ్ సాగులో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. దీని ద్వారా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతామని ఆయన హామీ ఇచ్చారు. సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన సీవీడ్, తీరప్రాంత నిఘా కేంద్రం స్టాళ్లను ఆయన సందర్శించి, అధికారుల పనితీరును అభినందించారు.

### అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన

తీరప్రాంత అభివృద్ధిలో మత్స్యకారులను భాగస్వాములను చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. రూ. 288 కోట్లతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపడుతున్నామని, దీని ద్వారా మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలోని 25 మత్స్యకార గ్రామాలను కలుపుతూ మెటల్ రోడ్లు నిర్మిస్తామని, నార్త్ బకింగ్‌హామ్ కెనాల్ పూడికతీతకు రూ. 6.19 కోట్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. కావలి ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటుతో స్థానికులకే ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. తుమ్మలపెంట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

### విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని, మత్స్య రంగం కూడా తీవ్రంగా దెబ్బతిందని చంద్రబాబు ఆరోపించారు. "గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాలు చేస్తోంది. బాబాయ్ హత్య నుంచి కుట్రల వరకు వారిది విధ్వంసమే. ఆ విధ్వంసాన్ని సరిదిద్దడానికి మాకు 23 నెలలు పట్టింది. ఇప్పుడు రాష్ట్రం బుల్లెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది" అని అన్నారు. రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 24 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తున్నామని, రాయలసీమలో డిఫెన్స్, ఏరోస్పేస్ పరిశ్రమలు, తిరుపతి వద్ద రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్లాంట్ వస్తున్నాయని వివరించారు.

### బీసీల సంక్షేమమే టీడీపీ డీఎన్ఏ

టీడీపీ డీఎన్ఏలోనే బీసీలు ఉన్నారని, వారికి దశాబ్దాల అనుబంధం ఉందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. బీసీలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి రుణం తీర్చుకుంటామని చెప్పారు. చేనేతలకు, నాయీ బ్రాహ్మణులకు, వడ్డెర్లకు, గీత కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, వారి జీవన ప్రమాణాలు పెంచడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, అచ్చెన్నాయుడు, ఫరూఖ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ నిరుద్యోగులకు భారీ ఊరట

ఉద్యోగాలకు అప్లై చేసుకోవచ్చు. మిగతా కేటగిరిల రిజర్వేషన్ బట్టి వారి వయోపరిమితి పెరుగుతుంది.

### వయోపరిమితి పెంచడానికి కారణమేంటీ?

తెలంగాణ రాష్ట్ర అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్, 1996 ప్రకారం... ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల గరిష్ట వయోపరిమితి 34 ఏళ్లుగా నిర్ణయించారు. అయితే రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ సమస్య, నోటిఫికేషన్ల జారీలో జరిగిన ఆలస్యం దృష్ట్యా, అభ్యర్థులు వయసు దాటిపోతున్నామనే ఆందోళనలో ఉన్నారు.

దీనిని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వ, రాబోయే ఒక ఏడాది కాలంలో ఇచ్చే నోటిఫికేషన్లకు పదేళ్ల వయసు అదనపు సడలింపును ప్రకటించింది. అంటే ఓపెన్ కేటగిరి అభ్యర్థులు 44 ఏళ్ల వయసు వరకు పోటీ పడవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర రిజర్వేషన్ వర్గాలకు ఈ 44 ఏళ్లకు అదనంగా వారి వారి కేటగిరి సడలింపు వర్తిస్తాయి.ఈ వయోపరిమితి పెంపునకు కారణాలు రెండు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షల మంది నిరుద్యోగ యువత, తాము వయోపరిమితి ముగిసే దశలో ఉన్నామని, గత కొన్నేళ్లుగా సరైన నోటిఫికేషన్లు లేకపోవడం వల్ల తమకు అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు పంపారు. వారి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

### గతంలో 12 ఏళ్లకు పెంపు

గతంలో ఫిబ్రవరి 8, 2024న ప్రభుత్వం జీవో నంబర్ 30ని విడుదల చేసింది. ఆ సమయంలో వయోపరిమితిని పదేళ్లకు అదనంగా మరో రెండేళ్లు పెంచి మొత్తం 46 ఏళ్లకు పెంచారు. అయితే ఈ జీవో గడువు 2026 ఫిబ్రవరితో ముగిసింది. దీంతో వయోపరిమితి మళ్లీ ప్రాథమిక స్థాయి అయిన 34 ఏళ్లకు పడిపోయింది. ఈ గ్యాప్‌ను భర్తీ చేయడానికి, కొత్త నోటిఫికేషన్లలో అభ్యర్థులకు అవకాశం కల్పించడానికి ప్రభుత్వం కొత్త జీవోను తీసుకొచ్చింది. జీవో నెంబర్ 86 ప్రకారం, ఈ పదేళ్ల వయోపరిమితి సడలింపు ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుంచి ఒక ఏడాదిపాటు మాత్రమే అమలులో ఉంటాయి. ఈ ఏడాది కాలంలో వివిధ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు విడుదల చేసే నోటిఫికేషన్లకు మాత్రమే ఈ సడలింపు వర్తిస్తుంది. ఈ సడలింపు అన్ని ప్రభుత్వం ఉద్యోగులకు వర్తించదు. ప్రభుత్వం స్పష్టంగా పేర్కొన్నట్టుగా, సివిల్ ఉద్యోగాలు, గ్రూప్స్, సెక్రటేరియట్ పోస్టులు ఇతర సాధారణ ప్రభుత్వ ఉద్యోగాలకు ఇది వర్తిస్తుంది. పోలీసు, ఎక్సైజ్, ఫైర్, జైళ్ల శాఖ వంటి యూనిఫామ్ సర్వీసులకు ఈ వయోపరిమితి పెంపు వర్తించదని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది.

## వాట్సాప్ మీసేవలో

# మరిన్ని జీహెచ్ఎంసీ సేవలు

అందుబాటు, పారదర్శకత కల్పించే దిశగా ఈ సేవలను విస్తరించారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

### ఇంటి నుంచే తొమ్మిది సేవలు

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీసేవ ద్వారా పౌర సేవలను మరింతగా తీర్చిదిద్దుతున్నట్లు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ సేవల ప్రధాన వేదికగా ఉన్న మీసేవను వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా మరింత విస్తరించారు. ఈ అదనపు డిజిటల్ ఛానల్‌ను 2025 నవంబర్ 18న ప్రారంభించారు. కొత్తగా జీహెచ్ఎంసీ ప్రాపర్టీ అసెస్‌మెంట్ రివిజన్, జనన ధ్రువీకరణ సవరణ, మరణ ధ్రువీకరణ సవరణ, బర్త్ హోమ్(ఇంటి దగ్గర పుట్టిన), డెత్ హోమ్(ఇంటి దగ్గర చనిపోయిన), ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ, ప్రాపర్టీ పేరు సవరణ, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ సేవలను వాట్సాప్ మీసేవలో చేర్చారు.

### వాట్సాప్ ద్వారా పౌరసేవలు

రాష్ట్రవ్యాప్తంగా పౌరులు ఈ సేవలను వాట్సాప్ ద్వారానే పొందవచ్చని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం తెలిపింది.సేవలు పొందేందుకు ముందుగా 8096958096 నంబర్‌ను మొబైల్‌లో 'మీసేవ తెలంగాణ' పేరుతో సేవ్ చేసుకోవాలి. అనంతరం వాట్సాప్‌లో ఆ నంబర్‌కు 'హాయ్' సందేశం పంపాలి. అవసరమైన సేవ పేరు టైప్ చేసి, మెనూలో కనిపించే 'ఓపెన్ సర్వీస్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఫారంలో అడిగిన వివరాలు, చెల్లింపు పూర్తిచేస్తే దరఖాస్తు వెంటనే వాట్సాప్ ద్వారా నమోదవుతుంది.

### వాట్సాప్ ద్వారా బర్త్, డెత్, ఇన్ కమ్ సర్టిఫికెట్లు పొందే అవకాశం

వాట్సాప్ ఆధారిత మీసేవ వేదికకు ప్రారంభం నుంచి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ప్రభుత్వం వెల్లడించింది. జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పోలీస్ చలాన్, విద్యుత్ బిల్లు, బీఐఈ ఫలితాల సేవలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలిపింది. రోజువారీ పరిపాలన సేవలకు వాట్సాప్‌పై ప్రజల ఆధారపడటం పెరుగుతోందని పేర్కొంది. డిజిటల్ సేవలను నిరంతరం విస్తరించడం, ప్రభుత్వ వ్యవస్థల విశ్వసనీయతను బలోపేతం చేయడం, పౌరులకు సులభమైన అనుభవం కల్పించడం తమ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

# బండి భగీరథ్ కేసులో మరో సిట్ ఏర్పాటు

ఈ నేపథ్యంలోనే తాజాగా ఇదే కేసుకు సంబంధించి మరో సిట్ ఏర్పాటు చేయడం గమనార్హం. బండి భగీరథ్ పోక్సో కేసులో సోషల్ మీడియా పోస్టులకు సంబంధించి విచారణ జరిపేందుకు హైదరాబాద్ పోలీసులు మరో సిట్‌ను ఏర్పాటు చేశారు. బండి భగీరథ్ కేసులో వాదనలు వింటున్న హైకోర్టు జడ్జిని టార్గెట్ చేస్తూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో చాలా అనుచిత పోస్టులు, దుష్ప్రచారం జరిగింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన పోలీసులు ఇప్పటికే ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు.ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియాలో పోస్ట్‌లపై దర్యాప్తు చేసేందుకు సిట్‌ను ఏర్పాటు చేస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. సోషల్ మీడియాలో అనుచిత పోస్టుల కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న నెల్లూరుకు చెందిన దామోదర్‌ను ఇప్పటికే అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే ఈ వ్యవహారంలో మరికొంతమందిపైనా కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ న్యాయవ్యవస్థను కించపరిచేలా పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు రెడీ అయ్యారు.కొత్త సిట్ చీఫ్‌గా జాయింట్ సీపీ శ్వేతను నియమించారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన పోస్టులు, వాటి మూలాలు, ఇలాంటి పోస్ట్‌లు పెట్టిన వ్యక్తుల వివరాలు, వాటి వెనుక ఉన్న కుట్ర కోణం వంటి కీలక అంశాలను సిట్ అధికారులు లోతుగా విచారించనున్నారు. బండి భగీరథ్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే ఆ జడ్జి భర్తకు బార్ కౌన్సిల్ ఛైర్మన్ పదవి ఇస్తారంటూ దామోదర్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసినట్లు గుర్తించారు.అయితే ఏకంగా హైకోర్టు జడ్జిపైనే అనుచిత పోస్టులు చేయడంతో ఈనెల 16వ తేదీన చార్మినార్ పోలీసులకు హైకోర్టు రిజిస్ట్రార్ అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఈ కేసును చార్మినార్ పోలీసులు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. అలాంటి అనుచిత సోషల్ మీడియా పోస్టులు చేసిన వారి వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు టెక్నికల్ ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా మరో సిట్ ఏర్పాటు చేయడంతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగంగా సాగనున్నట్లు తెలుస్తోంది.

# ఏపీలోని గ్రామాల్లో క్షేత్రస్థాయి సర్వే

సాధించేలా నూతన ఆదాయ వనరులను సృష్టించవచ్చని పవన్ కళ్యాణ్ సూచించారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో పవన్ కళ్యాణ్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె పండుగ 1, 2 కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో జరుగుతున్న ప్రగతిపై చర్చించారు.ఈ సందర్భంగా మాట్లాడిన పవన్ కళ్యాణ్ పల్లె పండుగ 1, 2 కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందన్నారు.

పల్లె పండుగ తొలి విడతలో 4వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తైందని 2వ విడతలో 3,580 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించినట్లు తెలిపారు. మొదటి విడతలో 22,514 గోకులాలు పూర్తిచేయగా రెండవ విడతలో15,303 గోకులాలు నిర్మించినట్లు వెల్లడించారు. పశువుల తాగునీటి అవసరాల కోసం 15,188 నీటి తొట్టెలు నిర్మించినట్లు తెలిపారు. మొదటి విడతలో 21 వేల ఫార్ పాండ్స్ పూర్తి చేస్తే రెండవ విడతలో 86 వేలు ఫార్మ్ పాండ్స్ కుంటలను తవ్వించినట్లు వెల్లడించారు.గ్రామాల్లో మురుగునీటి సమస్య నివారణ కోసం పల్లె పండుగ 2.0 కింద ఇప్పటి వరకూ 32.30 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించామని మ్యాజిక్ డ్రెయిన్స్ విధానాన్ని మరింత ఎక్కువ గ్రామాల్లో ప్రవేశపెట్టాలని పవన్ కళ్యాణ్ సూచించారు.

కొండలు, గుట్టలతో కూడిన మారుమూల గిరిజన గ్రామాల్లో కూడా పరిశుభ్రతను పెంచేందుకు ఈ సరికొత్త డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని నాణ్యత లోపిస్తే సహించేది లేదని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. రోడ్లకు జియో మానిటరింగ్ సిస్టమ్ తెచ్చామన్న పవన్ కళ్యాణ్ రోడ్ల పర్యవేక్షణ, డూప్లికేషన్‌కు చెక్ పెట్టేందుకు ఈ డిజిటల్ పద్ధతి ఉపయోగించాలన్నారు.ఇక ఉపాధి హామీ నిధులను ప్రభుత్వం నిర్దేశించిన బడ్జెట్ పరిమితి వరకే జిల్లా కలెక్టర్లు మంజూరు చేయాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అంతకు మించి అదనంగా ఇవ్వడం వల్ల ప్రభుత్వ లెక్కలకు, క్షేత్రస్థాయి ఖర్చులకు పొంతన లేకుండా పోయి నిధుల దుర్వినియోగానికి, ఆడిట్ ఇబ్బందులకు దారితీస్తోందని అభిప్రాయపడ్డారు. ఉపాధి హామీ మార్గదర్శకాల ప్రకారం అనుమతించిన పనులను మాత్రమే గ్రామాల్లో చేపట్టాలని ప్రభుత్వ నిబంధనల జాబితాలో లేని ఎలాంటి ఇతర పనులను ఉపాధి హామీ కింద చేయడానికి వీలు లేదని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# ఏపీలోని గ్రామాల్లో క్షేత్రస్థాయి సర్వే

కుక్కలకు కారుణ్యమరణం ఇవ్వవచ్చని స్పష్టం చేసింది. ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నప్పుడు దయ చూపడం కంటే రక్షణకే ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించింది.

### ప్రజా ప్రాంగణాల్లో కుక్కలు ఉండకూడదు

గత నవంబర్ 7, 2025 ఇచ్చిన తీర్పును సవరించాలని జంతు ప్రేమికులు కోరిన పిటిషన్లను కోర్టు తోసిపుచ్చింది. ఆసుపత్రులు, పాఠశాలలు, విద్యాసంస్థలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ లు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి రద్దీ ప్రాంతాల్లో వీధి కుక్కలు ఉండటానికి వీల్లేదని ఖరాకండిగా చెప్పింది. ఒకవేళ వీధి కుక్కలను పట్టుకుని స్టెరిలైజేషన్ చేసినా వాటిని తిరిగి అవే రద్దీ ప్రాంతాల్లో వదిలిపెట్టకూడదని, వాటి కోసం ప్రత్యేక షెల్టర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

### అధికారులకు కోర్టు ధిక్కరణ భయం

ఈ ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించే మున్సిపల్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకుంటామని ధర్మాసనం హెచ్చరించింది. ప్రతి జిల్లాలో కనీసం ఒక యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, తగినన్ని యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. హైకోర్టులు ఈ తీర్పు అమలును పర్యవేక్షించాలని సూచించింది.

### చట్టబద్ధమైన రక్షణ

కోర్టు ఆదేశాలను అమలు చేసే క్రమంలో నిజాయితీగా పనిచేసే అధికారులపై తక్షణమే కేసులు నమోదు చేయవద్దని కూడా సుప్రీంకోర్టు తెలిపింది. ఒకవేళ ఎవరైనా దురుద్దేశంతో తప్పుడు చర్యలకు పాల్పడితే తప్ప, సామాన్య పౌరుల భద్రత కోసం పనిచేసే అధికారులకు రక్షణ ఉంటుందని పేర్కొంది.

# దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్

చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మే 20వ తేదీన దేశంలోని అన్ని మెడికల్ షాపులను మూసివేయాలని ఏఐఓసీడీ పిలుపునిచ్చింది. దీంతో ఈ నిర్ణయానికి అనుగుణంగా రేపు అన్ని రాష్ట్రాల్లోని ఫార్మసీ దుకాణాలు మూతపడనున్నాయి. ఇక ఏఐఓసీడీ ఇచ్చిన బంద్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్లు మద్దతు తెలిపాయి.కేంద్రం తీసుకున్న ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నేడు దేశం మొత్తం మెడికల్ షాప్‌లు బంద్ కానున్నాయి. ఈ మేరకు ఏఐఓసీడీ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే బుధవారం రోజున దేశంలో ఉన్న సుమారు 12.40 లక్షల మెడికల్ దుకాణాలు, డిస్ట్రిబ్యూటర్లు తమ సేవలు నిలిపివేయనున్నారు. ఆన్‌లైన్ మందుల సరఫరాకు కేంద్రం ప్రభుత్వం అనుమతిస్తూ తీసుకున్న నిబంధనలను తక్షణమే రద్దు చేయాలని ఏఐఓసీడీ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి పర్యవేక్షణ లేకుండా ఆన్‌లైన్ ఫార్మసీలు మెడిసిన్ విక్రయిస్తుండటం వల్ల నకిలీ మందుల అమ్మకాలు పెరిగిపోతున్నాయని ఆరోపిస్తున్నారు.దీనివల్ల ఇటు తమ వ్యాపారాలు తీవ్రంగా నష్టపోవడమే కాకుండా అటు ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుందని ఫార్మసీ వ్యాపారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు రకరకాల రూల్స్ పేరుతో తమను డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తీవ్రంగా వేధిస్తున్నారని మెడికల్ షాప్ ఓనర్లు తవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో ఉన్న 30 వేలకు పైగా మెడికల్ ఫార్మసీలు ఈ బంద్‌లో పాల్గొననుండటంతో అవన్నీ మూసివేయనున్నారు. ఇందులో ఒక్క హైదరాబాద్ నగరంలోనే 16 వేలకు పైగా మెడికల్ షాప్‌లు ఉండటం గమనార్హం.ఇలా ఒకేసారి వేల సంఖ్యలో మెడికల్ షాపులు ఒక రోజు మొత్తం మూసివేస్తారని వార్తలు వస్తున్న వేళ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని ఈ బంద్‌లో కొన్ని మినహాయింపులను పాటించనున్నట్లు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని అమృత్ ఫార్మసీలు, ఇన్‌సైడ్ హాస్పిటల్ మెడికల్ షాపులు ఎప్పటిలాగే పనిచేస్తాయని తేల్చి చెప్పారు. ఇక ఎమర్జెన్సీ మెడిసిన్ ఇచ్చే 24/7 మెడికల్ స్టోర్లను కూడా ఈ బంద్ నుంచి మినహాయింపు కల్పిస్తున్నట్లు తెలిపారు.ఏఐఓసీడీ బంద్ నేపథ్యంలో పేషంట్లు, వారి బంధువులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏవైనా అత్యవసరమైన మందులు కావాల్సి వస్తే తమ పరిస్థితి ఏంటా అని తీవ్రంగా వాపోతున్నారు. ఇక షుగర్, బీపీ, కిడ్నీ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ముందుగానే 2, 3 రోజులకు సరిపడా మందులను కొనుగోలు చేసి పెట్టుకోవాలని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు కీలక సూచనలు చేశారు. దీనిపై వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని లేకపోతే భవిష్యత్తులో నిరవధిక బంద్‌కు కూడా తగ్గేది లేదని తీవ్ర హెచ్చరికలు చేశారు.

# ఇన్‌స్టాగ్రామ్‌తో ఇన్‌ఫ్లుయెన్స్ చేసి సీఎం అయ్యారు

రాజకీయ ప్రాధాన్యాన్ని నిలబెట్టుకుందని స్టాలిన్ వెల్లడించారు. ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడం పట్ల పలువురు విచారం వ్యక్తం చేశారు. కానీ మనం బాధపడాల్సిన పని లేదని స్టాలిన్ అన్నారు.డీఎంకే హయాంలో ప్రారంభించిన పలు సంక్షేమ పథకాలను కొత్త ప్రభుత్వం కొనసాగించడం పట్ల స్టాలిన్ స్పందించారు. తమిళనాడులో పరిపాలనను ఇప్పటికీ తమ పార్టీ విధానాలే నిర్దేశిస్తున్నాయన్నారు. ఓటమి పట్ల తాను కుంగిపోలేదన్న స్టాలిన్ ఓటమి ఎదురైనప్పుడు డీఎంకే ఫినిక్స్ పక్షిలా పైకి లేస్తుందన్నారు. గతంలోనూ తాము ఎన్నో విజయాలు, ఓటములను చవిచూశామన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికలు ముగియగానే తాము అసెంబ్లీ ఎన్నికల కోసం సన్నద్ధం కావడం ప్రారంభించామని ఎంతో చేసినప్పటికీ, తాము ఎందుకు అధికారంలోకి రాలేదని ఆయన ప్రశ్నించారు. టీవీకే బూత్ ఏజెంట్లను కూడా సరిగా నియమించక పోయినప్పటికీ ఎన్నికల్లో ఎలా గెలువగలిగిందని ఆయన ప్రశ్నించారు.ఈ అనుభవాల నేపథ్యంలో భవిష్యత్ ఎన్నికల్లో పార్టీ అప్రమత్తంగా ఉంటుందని స్టాలిన్ తెలిపారు. సోషల్ మీడియాను సరిగా వాడుకోవడం నిర్దిష్ట ఓటర్లను లక్ష్యంగా చేసుకొని సాగే ప్రచారం ఆధారంగా మారుతున్న ఎన్నికల ప్రచార శైలికి తగ్గట్టుగా తమను తాము మార్చుకుంటామని స్టాలిన్ తెలిపారు. టీవీకే ప్రభుత్వ పరిపాలనకు తాము ఎలాంటి ఆటంకాలు కల్పించబోమన్న స్టాలిన్ అయితే అధికార కూటమి వ్యాప్తి చేసే తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని పార్టీ కార్యకర్తలకు ఎక్స్ ద్వారా పిలుపునిచ్చారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఓటమిపై నియోజకవర్గాల వారీగా సమీక్షించేందుకు స్టాలిన్ 38 మంది సభ్యులతో కూడిన ఓ కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని మొత్తం 234 నియోజకవర్గాల్లో పరిస్థితిని సమీక్షించి క్షేత్రస్థాయి కార్యకర్తలు, పార్టీ పదాధికారుల నుంచి ఫీడ్ బ్యాక్‌ను సేకరించే బాధ్యతను ఈ కమిటీకి అప్పగించారు. ఈ కమిటీ ఇచ్చే నివేదికల ఆధారంగా జూన్ చివరి నాటికి పార్టీలో సంస్థాగత సంస్కరణలను చేపడతామని స్టాలిన్ తెలిపారు.

# విజయలక్ష్మి లాడ్జ్ సీజ్

**జగిత్యాల** ధర్మపురి లోని విజయలక్ష్మి గెస్ట్ హౌస్ ను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సీజ్ చేసారు. ఈనెల 3న కరీంనగర్ పిఎంజే జ్యువెలరీ షాప్ చోరికి పాల్పడిన ఐదుగురు నిందితులు విజయలక్ష్మి లాడ్జి లోనే బస చేసారు. నిబంధనలకు విరుద్ధంగా విజయలక్ష్మి లాడ్జి నిర్వహణ జరిగిందని పోలీస్ ప్రొటెక్షన్ మధ్య మున్సిపల్ కమిషనర్ లాడ్జ్ సీజ్ చేసారు.

# పేదల పెన్నిధి పుచ్చలపల్లి సుందరయ్యకు మండల కేంద్రంలో ఘన నివాళులు

**తుగ్గలి:** పేదల పెన్నిధి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.మంగళవారం రోజున సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శ్రీ రాములు మాట్లాడుతూ ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు,తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సారధి సుందరయ్య తన ఆస్తిని పార్టీకి ఇచ్చేసి,చివరి వరకు నిరాడంబరంగా జీవించారని, భూస్వామ్య,పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా రైతు కూలీలను సంఘటితపరిచిన మహానేత అని ఆయన ఆశయ సాధన కోసం యువత నడుం బిగించాలని ఆయన తెలియజేశారు.దేశంలో సిపిఎం పార్టీ తరపున పట్టుదలతో పనిచేసి ఎంతోమంది ప్రజలను సిపిఎం పార్టీ వైపు మల్లెలా కృషి చేశారని ఆయన తెలియజేశారు.ఆయన సేవలకు గాను సిపిఎం పార్టీ జాతీయ కార్యదర్శిగా మూడుసార్లు ఎన్నికై ఎంతోమంది బడుగు బలహీన వర్గాల ప్రజలకు, రైతులకు మంచి సేవలు అందించి గుర్తింపును పొందారని మండల కార్యదర్శి శ్రీరాములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ అనుబంధ సంఘాల మండల కమిటీ నాయకులు రంగస్వామి,సూర్య నారాయణ రెడ్డి,సుధాకర్,ప్రసాద్, దేవదాసు,రైతు సంఘం నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# "కమ్యూనిస్టు గాంధీ" మా పుచ్చలపల్లి సుందరయ్య

## - రేణిగుంట లో ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి



**రేణిగుంట** భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, "కమ్యూనిస్టు గాంధీ"గా పేరొందిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ఆయన చిత్రపటానికి నారాయణ, దస్తగిరి కలిసి పూలమాల వేసి సిపిఎం కార్యకర్తలు ఘన నివాళు లర్పించారు. "రెడ్ సెల్యూట్" కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య.. మీ ఆశయాలను సాధిస్తాం. అంటూ నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ.. కామ్రేడ్ సుందరయ్య 1913, మే 1న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, విడవలూరు మండలం, అలగానిపాడు గ్రామంలో జన్మించారు. మహాత్మా గాంధీ పిలుపు మేరకు 1930లో చదువును మధ్యలోనే వదిలి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) అఖఎ(ఓ) వ్యవస్థాపక సభ్యులలో ఒకరు. 1964 నుండి 1978 వరకు ఆ పార్టీకి మొదటి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారు. జీవితాంతం నిరాడంబరంగా జీవించి, పేదలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా పోరాడారు.స్ఫూర్తిదాయక జీవితంసుందరయ్య ప్రజల మనిషిగా, సమసమాజ స్థాపన కోసం తన ఆస్తిపాస్తులను సైతం త్యజించి ప్రజల కోసం అంకితమైన మహనీయుడు. ఆయన చేసిన త్యాగాలు మరియు పాటించిన విలువలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఐదు మంది కొత్త కార్యకర్తలకు ఆక్సిలరీ నుండి క్యాండిడేట్ సభ్యత్వం ను భారతి, సులోచన, పద్మమ్మ, నారాయణ, దస్తగిరి లకు ఇవ్వడం జరిగిందని పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.ఈ కార్యక్రమంలో రేణిగుంట టౌన్ సిపిఎం పార్టీ కార్యదర్శి కె.ఈశ్వరమ్మ, భారతి, సులోచన, లక్ష్మమ్మ, పద్మమ్మ, మహాలక్ష్మమ్మ, నారాయణ, దస్తగిరి, ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కడపలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ నాగేంద్ర మాధవ్‌ను కలిసిన బద్వేల్ ఏఎంసీ చైర్‌పర్సన్ సుప్రజ



**పోరుమామిళ్ల** రైతు శ్రేయస్సు కోసం మరింత కృషి చేయాలని నాగేంద్ర మాధవ్ పిలుపు సుప్రజ పనితీరుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ప్రశంసల జల్లు?పండిట్ దీన్ దయాల్ ప్రశిక్షణ కార్యక్రమంలో భాగంగా కడప నగరానికి విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ నాగేంద్ర మాధవ్ ని బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుప్రజ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.?ఈ సందర్భంగా బద్వేల్ నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు అందుతున్న సేవలు, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆమె నాగేంద్ర మాధవ్ గారికి వివరించారు.?రైతు శ్రేయస్సే ముఖ్యం : పీవీ నాగేంద్ర మాధవ్?సుప్రజ గారి వివరణపై స్పందించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఆమె పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా, రైతు శ్రేయస్సు కోసం భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడుతూ, ఇంకా బాగా పనిచేయాలని ఆమెకు దిశానిర్దేశం చేశారు. చైర్‌పర్సన్‌గా రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.”రైతుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే నాయకులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది. సుప్రజ బద్వేల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.”? పీవీ నాగేంద్ర మాధవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు?ఈ సమావేశంలో పలువురు బీజేపీ ముఖ్య నేతలు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంకటాపురం జోరుగా మట్టి తొలకలు

**- చెరువును తవ్వి నల్లమట్టి తరలింపు**

**- కన్నెత్తి చూడని రెవెన్యూ ఇరిగేషన్ శాఖ అధికారులు**



**గోకవరం** మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా వెంకటాపురం చెరువు నల్ల మట్టి తరలిస్తున్నారు . జెసిపిలతో చెరువుని తవ్వి అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. గత రెండు నెలలుగా అక్రమ మట్టి తరలింపులు జరుగుతున్నాయి. ఇంత అక్రమ మట్టి తరలించిపోతున్న ఇరిగేషన్ శాఖ రెవిన్యూ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం కోస మెరుపు. తూతూ మంత్రంగా పరిమిషన్ లు తీసుకొని అక్రమంగా ఇటుక బట్టీలకు మట్టి అమ్ముకుంటున్నారు. అక్రమంగా లక్షలు మట్టి అమ్ముకుంటున్న స్థానిక ప్రజాప్రతినిధులు గాని ప్రభుత్వ అధికారులు కానీ స్పందించకపోవడం గమనహారం. అక్రమ మట్టి తరలింపులు ఎనకాల బడా బాబులు హస్తం ఉన్నట్లు కూడా ప్రసారం జోరుగా సాగుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మట్టి మాఫియా రెచ్చిపోతుందని గుసగుసలు జోరుగా వినిపిస్తున్నాయి. చెరువును చూస్తే అక్రమార్కులు కన్నేసి రైతుల పేరు మీద తూత్ మంత్రంగా పర్మిషన్ తెచ్చుకొని అక్రమంగా మట్టి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న అధికార పార్టీ యంత్రాంగం మాట పక్కన పెడితే ప్రతిపక్షం కూడా నోరు ఎత్తకపోవడం పలు అనుమానాలు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధించిన శాఖ అధికారుల స్పందించి వెంకటాపురం చెరువు తవ్వి అక్రమంగా నల్ల మట్టి తరలిస్తున్న వారు పైన చర్యలు తీసుకుని అక్రమ మట్టి అడ్డుకట్టు వేయాలని పరువురు కోరుతున్నారు

## 63 అంతస్తులతో స్కైవెన్ ప్రాజెక్ట్

ప్రీమియం లగ్జరీ నివాసాలను అందించేందుకు ఈన్నా, పింగ్లే వెంచర్స్ అండ్ రియాల్టీ (పీవీఆర్) సంస్థలు ‘ది స్కైవెన్’ పేరుతో హైదరాబాద్ కోకాపేట్ లో 63 అంతస్తుల నివాస భవనాన్ని కి సంబంధించిన పోస్టర్ను బంజారాహిల్స్ లోని పార్క్ హయత్ హోటల్లో బ్రోచర్ను ప్రారంభించారు. రెండెకరాల్లో 233 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తున్న ఈ స్కైస్క్రాపర్ లో పెంట్ హౌస్లు, స్కై విల్లాలు, నాలుగు బెడ్రూమ్స్ ఇళ్లు అందుబాటులో ఉంటాయి. ఈ ప్రాజెక్టులో నివాసితులకు అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పిస్తున్నట్లు ఈన్నా భాగస్వామి రమేష్ రెడ్డి తెలిపారు. భవనంపై భాగంలో రూఫ్టప్ క్లబ్, ఇన్ఫినిటీ పూల్, నక్షత్రశాల, స్పా, వెల్నెస్ సెంటర్ హెలిప్యాడ్ కల్పిస్తున్నారు. ఒక్కో ఫ్లాట్ ధర రూ.6.23 కోట్ల నుంచి మొదలవుతుంది. 2030 నుంచి డెలివరీలు మొదలవుతాయి.

## విద్యార్థుల భద్రతకు తుగ్గలి ఎస్సై చొరవ

**- రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు**



**తుగ్గలి**విద్యార్థుల భద్రత దృష్ట్యా తుగ్గలి ఎస్సై నరేష్ స్థానిక ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించారు.మంగళవారం రోజున మంత్రాలయం?గుత్తి ప్రధాన రహదారిపై వాహనాల వేగ నియంత్రణలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో స్పీట్ బ్రేకర్లను వేయించారు.పాఠశాల సమీపంలో వాహనాలు అతివేగంగా వెళ్లకుండా ప్రమాదాలను నివారించడానికి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసినట్లు తుగ్గలి ఎస్సై నరేష్ తెలియజేశారు.మంగళవారం ఎస్సై నరేష్ స్వయంగా పర్యవేక్షిస్తూ రోడ్ రోలర్ సహాయంతో తారు మిశ్రమాన్ని ఉపయోగించి స్పీడ్ బ్రేకర్లు వేయించారు.వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని సూచించారు.వాహనదారులు వేగాన్ని తగ్గించి వెళ్లడం ద్వారా, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని తుగ్గలి ఎస్సై నరేష్ తెలియజేశారు.తుగ్గలి ఎస్సై నరేష్ ప్రత్యేక చొరవ చూపించి ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు వేయించడం ద్వారా పలువురు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేవుడి ఉత్సవాలపై ఆంక్షల పర్వం..

**- బోడపాడులో భక్తుల ఆవేదన**



**బ్రహ్మంగారిమఠం** బోడపాడు గ్రామంలో ఆధ్యాత్మికత ఉట్టిపడాల్సిన వేళ.. ఆంక్షల నీడలు అలుముకోవడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎంతో చరిత్ర కలిగిన ఆంజనేయ స్వామి ఆలయ హనుమాన్ జయంతి ఉత్సవాలను సాఫీగా జరగకుండా, అడుగడుగునా ఆటంకాలు సృష్టించడంపై బోడపాడు గ్రామ మహిళలు, యువత, మరియు భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తిభావంతో నిర్వహించుకునే దేవుడి కార్యక్రమాల్లో కూడా ఈ స్థాయి రాజకీయాలు ఏంటని స్థానికులు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు.నిజానికి, గ్రామీణ ప్రాంతాల్లో ఏటా జరిగే ఆలయ ఉత్సవాలు గ్రామస్తులందరి సమిష్టి వేడుకలు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పాల్గొనే పండుగలు ఇవి. అలాంటిది, హనుమాన్ జయంతిని పురస్కరించుకుని బోడపాడు భక్తులు ఎంతో ఇష్టంగా ఏర్పాటు చేసుకున్న ఉత్సవాల కార్యక్రమాలను సైతం యంత్రాంగం అడుగడుగునా అడ్డుకోవడం నిజంగా విచారకరం. దేవుడి సన్నిధిలో భక్తితో సాగే వేడుకల వల్ల శాంతిభద్రతలకు వచ్చే విఘాతం ఏముంటుంది? శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో సామాన్య భక్తుల స్వేచ్ఛను, వారి నమ్మకాలను హరించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఇప్పుడు ప్రతి ఒక్కరి గుండెల్లో వ్యక్తమవుతున్నాయి.ఈ నేపథ్యంలోనే.. ఆలయ సందర్శనకు విచ్చేసిన కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి, మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి, జిల్లా జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి, బద్వేల్ శాసనసభ్యురాలు డాక్టర్ సుధా ముందర బోడపాడు గ్రామ మహిళలు, యువకులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. “ఇంత అన్యాయమా.. దేవుడి కార్యక్రమాలు కూడా చేసుకోనివ్వరా? వీళ్లకు భగవంతుడంటే భయం లేదా?” అంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు దీనిపై ఎంపీ అవినాష్ రెడ్డి స్పందిస్తూ.. కూటమి ప్రభుత్వం పోలీసులను ముందు పెట్టి ఉత్సవాలను సాఫీగా జరగకుండా అడ్డుకుందని, తమ కార్యకర్తలపైనే కాకుండా సాక్షాత్తు ఆంజనేయ స్వామిపై కూడా కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని తీవ్రంగా మండిపడ్డారు. భవిష్యత్తులో ఈ తప్పుడు ఆనవాయితీకి కూటమి ప్రభుత్వం భగవంతునికి, ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారి మఠం మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పిటిసి, బిజీవేముల రామసుబ్బారెడ్డి, దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి, బద్వేల్ మాజీ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, బద్వేల్ మాజీ ఎంపీపీ వెంకటేశ్వర రెడ్డి, బ్రహ్మంగారిమఠం మాజీ సింగల్ విండో చైర్మన్ సుబ్బారెడ్డి, ఎగువ నేలటూరు మాజీ ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి, బిజీ వేముల రామకృష్ణారెడ్డి, ఖదుమాల సుబ్బారెడ్డి, గాజులపల్లి చిన్న కేశవరెడ్డి, మన్యం రామిరెడ్డి, బిజీ వేముల చిన్న వెంకట సుబ్బారెడ్డి, బిజి వేముల వెంకట సుబ్బారెడ్డి (హోటల్), బీరం పిచ్చిరెడ్డి, బిజీ వేముల సుబ్బారెడ్డి, మధుసూదన్ రెడ్డి, తిరుపాల్ రెడ్డి, నాగిశెట్టిపల్లె మాజీ సర్పంచ్ అనంతరెడ్డి, దిరశవంచ మాజీ సర్పంచ్, అమీర్ భాష లతో పాటు బద్వేల్, మైదుకూరు ప్రాంతాలకు చెందిన వైయస్ఆర్సీపీ ముఖ్య నాయకులు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

## భరోసా పార్టీ అధ్యక్షుడిపై ఉన్మాదుల అతి కిరాతక దాడిని ఖండించండీ

**- సమగ్ర విచారణ జరిపించి దోషులను శిక్షించాలి.**

**- ఆదివాసీ గిరిజన సంఘం**



**అరకులోయ** అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రశాంతమైన స్వచ్ఛమైన ఆదివాసీ ప్రాంతం చింతపల్లిలో భరోసా పార్థి అధ్యక్షులు అభినయన్ దర్శన్ పై గుర్తుతెలియని దుండగులు,ఉన్మాదులు అతికిరాతకంగా దారుణంగా మరణ ఆయుధాలతో కాపుగాసి దాడి చెయ్యడం దుర్మార్గమని, ఈ ఘటను ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా ఖండించింది.అరకులోయ గిరిజన సంఘం భవనంలో మీడియా సమావేశం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, స్వచ్ఛమైన జీవనవిధానానికి విఘాతం కలిగించే విధంగా, ఏజెన్సీ ప్రాంతంలో ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిపై పట్టపగలు నడిరోడ్డుపై గుర్తు తెలియని దుండగులు, ఉన్మాదులు దాడి చేయడం ప్రభుత్వ వైఫల్యం. కత్తులు కర్రలతో కిరాతకా దాడి చెయ్యడం హేమమైన చర్యని ఇది పథకం ప్రకారం జరిగిన హత్య యత్నం. ఇటువంటి భౌతిక దాడుల ఏజెన్సీ ప్రాంతం లో అశాంతిని సృష్టిస్తుంది. ఆదివాసీ ప్రజల్లో భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఇటువంటి అరాచక సంస్కృతి ఏజెన్సీ ప్రాంతంలో లేదని, కొంతమంది వ్యక్తులు కావాలని ఏజెన్సీ ప్రాంతంలో ఇటువంటి ఘటనకు కారణం అవుతున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యల మీద బహిరంగంగా మాట్లాడుకునే హక్కు రాజ్యాంగం ప్రతి ఒక్కపరుడు ఇచ్చిందని వీటిని జీర్ణించుకోలేక ఇంటివటి ఘటనకు కొంతమంది పూనుకుంటున్నారు.ప్రకృతి ఆరాధకులైన ఆదివాసులను కొన్ని వర్గాల వారు తమ ఆధిపత్యం కోసం అనేక ప్రయత్నాలు చేస్తూ ఆదివాసీ ప్రజలపై తమ మతం రంగు పూస్తున్నారు. బలవంతం రుద్దుతున్నారు. భరోసా పార్టీ అధ్యక్షులు అభినయన్ దర్శన్ పై దాడి చేసిన వారిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ దాడి పై సమగ్ర సమాచారాన్ని ప్రజలకే ప్రభుత్వం తెలియజేయాలని కానీ ప్రభుత్వ ఇప్పటికే వీటిని పక్క దారి పట్టించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఇటువంటి చర్యలకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు ఖండించాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటన పునరుద్దరణ కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు పరిరక్షణ కోసం ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోకపోవడం వల్ల ఆదివాసీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు కావాలనే మతం పేరుతో ఆదివాసులను రెచ్చగొడుతున్నారని .ప్రభుత్వం వాటిని నివారించవలసిన బాధ్యత ఉందన్నారు,ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు, పాంగి నానిబాబు పాల్గొన్నారు

## మే 30న నాగలాపురంలో శ్రీ వేద నారాయణ స్వామివారి దివ్య కంచి గరుడసేవ

**తిరుపతి,** భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తే శ్రీ వేద నారాయణ స్వామివారి కంచి గరుడసేవ మే 30న నాగలాపురం ఆలయంలో వైభవంగా జరగనుంది. కంచిలోని శ్రీ వరదరాజ స్వామివారి ఆలయంలో నిర్వహించే మహా గరుడసేవను పురస్కరించుకొని నాగలాపురంలోని శ్రీ వేద నారాయణ స్వామివారి ఆలయంలో ఈ గరుడసేవను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.ఈ సందర్భంగా ఉదయం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన శ్రీ వేద నారాయణ స్వామివారు గరుడ వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో దివ్య విహారం చేస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామివారి దివ్య మంగళ విహారాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని ఆలయ అధికారులు కోరారు.

## తాతయ్య గుంట గంగమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి అనగాని సత్యప్రసాద్



**తిరుప** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సోదరి అయిన శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లిని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి అనగాని సత్యప్రసాద్, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిలకు గంగమ్మ దేవస్థానం ఛైర్మన్ మహేష్ యాదవ్ మరియు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.ఆలయ సాంప్రదాయం ప్రకారం మంత్రి అనగాని సత్యప్రసాద్, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి గార్లకు దేవస్థానం ఛైర్మన్ మహేష్ యాదవ్ గజమాలతో ఘనంగా సత్కరించారు.

అనంతరం వారు అమ్మవారి మూలవిరాట్టును దర్శించుకుని, ప్రత్యేక పూజలు మరియు అర్చనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సస్యశ్యామలం కావాలని అమ్మవారిని ప్రార్థించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు మంత్రికి, తుడా ఛైర్మన్‌కు వేద ఆశీర్వచనం పలికారు. ఛైర్మన్ మహేష్ యాదవ్ వారికి అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం మరియు అమ్మవారి పవిత్ర ప్రతిమను బహుకరించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో కూటమి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహా యాదవ్ తెదేపా తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు పనబాక లక్ష్మి, శ్రీధర్ వర్మ, పులిగోరు మురళి కృష్ణ,జిల్లా నాయకులు,దేవస్థానం బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు, అర్చకులు మరియు భక్తులు పాల్గొన్నారు

## వడదెబ్బతగిలి స్పృహతప్పి పడిపోయిన ఉపాధి కూలి



**అరకులోయ** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం బస్కి పంచాయితీ కొర్రగుడ గ్రామానికి చెందిన కొర్రా.నీలయ్య మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు ఉపాధి హామీ పనిచేస్తూ విపరీతంగా ఎండ కాయడంతో స్పృహ తప్పి పడిపోయారు.పక్కన మిగత కూలీలు ఉండి సమయానికి నీళ్లు తాగించడం వలన ప్రాణాపాయం తప్పిందని కూలీలు కొర్ర.లక్ష్మణ్, సమర్ధి. దామోదర్ తిలిపారు. కావున కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పని ప్రదేశంలో టెంటు, మంచినీరు ప్రధమచికిత్స పెట్టె తదితర సామాగ్రి సరఫరా చేయాలనీ, అలాగే ముఖహాజరు వ్యవస్థను రద్దుచేయాలనీ కూలీలు కోరుతున్నారు.

## అనకాపల్లి సీసీఎస్ పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి :** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా జిల్లా కేంద్రంలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (అఊ) ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు సమక్షంలో జరిగిన ఈ తనిఖీల్లో భాగంగా ఎస్పీ స్టేషన్ ఆవరణను పరిశీలించి, శాంతిభద్రతలు మరియు నేరాల నియంత్రణకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, రికార్డుల క్రమబద్ధీకరణపై సీసీఎస్ సీఐ కె.అప్పలనాయుడును అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఎస్పీ సీసీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వేసవి కాలంలో ఇళ్లు తాళాలు వేసి ఉండటం వల్ల చోరీలు జరిగే అవకాశం ఎక్కువ ఉన్నందున పాత నేరస్థులు (ఐఆబ), బ్యాడ్ క్యారెక్టర్స్ (ఃఅబ) మరియు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, ‘ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్’ సాంకేతికతను విరివిగా ఉపయోగించాలని ఆదేశించారు.కఠినమైన కేసులను సాంకేతికత మరియు చాకచక్యంతో ఛేదించి, పొరుగు రాష్ట్రాలకు సైతం వెళ్లి ముద్దాయిలను బంధించిన సీసీఎస్ బృందాన్ని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా శ్లాఘించారు. ఈ ఆపరేషన్లలో పాల్గొన్న ప్రతి ఒక్క అధికారిని, కానిస్టేబుల్ను ఆయన పేరుపేరునా పిలిచి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో పనిచేసి జిల్లాను నేరరహితంగా మార్చాలని పిలుపునిచ్చారు.

# మిడ్ మానేరు రిజర్వాయర్‌లో మట్టి మాఫియాపై ఉక్కుపాదం

**- ఏ.ఈ ఫిర్యాదుతో కేసు నమోదు - జేసీబీ, నాలుగు ట్రాక్టర్లు సీజ్**

**- వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ : శ్రీనివాస్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, కొదురుపాక వద్ద ఉన్న మిడ్ మానేరు రిజర్వాయర్‌లో అక్రమ మట్టి తవ్వకం, రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో మిడ్ మానేరు రిజర్వాయర్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గన్నా రాకేష్ మంగళవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించారు.తనిఖీల సమయంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఒక జేసీబీ సహాయంతో నాలుగు ట్రాక్టర్లలో మట్టిని నింపి తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే జేసీబీతో పాటు నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గన్నా రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక జేసీబీ, నాలుగు ట్రాక్టర్లు, వాటి డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ రూరల్ సీఐ ఎం. శ్రీనివాస్ తెలిపారు.

# కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం

**- తప్పిన ప్రాణహాని, భారీ ఆస్తి నష్టం - 50 లక్షల పైన ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా**







మేడ్చల్( ప్రశ్న న్యూస్) మేడ్చల్ చెక్పోస్ట్ పరిధిలోని పారిశ్రామిక వాడలో ఆగ్రో కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. అయితే ఈ ప్రమాదంలో మంటలు ఎగిసిపడ్డాయి. రెండు ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలు ఆర్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ కెమికల్ ఫ్యాక్టరీ చుట్టూ పలు ఫ్యాక్టరీలు ఉండడం వల్ల ఎగిసి పడ్డ మంటలు ఇతర కంపెనీలకు పాకకుండా అధికారులు జాగ్రత్త పడ్డారు. అగ్ని ప్రమాద సంభవించే ముందు అందులో 5 గురు కార్మికులు పనిచేస్తున్నారు. అదే సమయంలో అగ్ని ప్రమాదం సంభవించడంతో ఈ ఐదుగురు కార్మికులు సురక్షితంగా బయటపడ్డారు.

**అసలు ఏం జరిగింది.**

మేడ్చల్ చెక్పోస్ట్ వద్ద గల ఆగ్రో కెమికల్ ఫ్యాక్టరీలో 12 గంటల ప్రాంతంలో మంటలు చెల్లరేగాయి. చూస్తుండగానే పెద్ద మొత్తంలో మంటలు చెలరేగడం భారీ ఎత్తున పొగలు వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా జనాలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. రెండు ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను ఆర్పాయి. అప్పటికే భారీ ఎత్తున ఆస్తి నష్టం జరిగినట్లు కెమికల్ కంపెనీ యజమానులు పేర్కొన్నారు. మేడ్చల్ సీఐ సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అప్పటికి పక్కనే ఉన్న మరో కంపెనీకి మంటలు వ్యాప్తి చెందాయి. ప్రాణం నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# విద్యా శాఖ గాడి తప్పింది - ఏ.ఐ.ఎస్.బి. ఆగ్రహం

**-నిబంధనలు అతిక్రమిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**- ఏఐఎస్బి రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలు, అకాడమీలు, కళాశాలలపై ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్బి రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రి లేకపోవడంతో విద్యా వ్యవస్థ గాడితప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని అనేక ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్,డిగ్రీ కళాశాలలు, కోచింగ్ అకాడమీలు నిబంధనలను పట్టించుకోకుండా ప్రారంభమవుతున్నాయని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో కొంతమంది యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు.అలాగే, విద్యాసంస్థలకు అనుమతులు జారీ చేసే ప్రక్రియలో కూడా తీవ్ర నిర్లక్ష్యం నెలకొన్నదని, నిబంధనలకు విరుద్ధంగా పర్మిషన్లు మంజూరు చేస్తున్న అధికారులపై ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ప్రమాణాలు పాటించని పాఠశాలలు, కళాశాలలు, అకాడమీల గుర్తింపును రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐఎస్బి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మెట్టు రాకేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రేకులపల్లిలో గాలివాన బీభత్సం

**- ఇంటి రేకులు ఎగిరిపోయిన వైనం**



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని రేకులపల్లి గ్రామంలో ఈదురుగాలులతో ఎరుగు రవికుమార్ నివాసం దెబ్బతింది. సాయంత్రం ఒక్కసారిగా వచ్చిన గాలివాన ధాటికి రవికుమార్ ఇంటిపై ఉన్న రేకులు పూర్తిగా గాలికి ఎగిరిపోయాయి దీంతో ఒక్కసారిగా ఇల్లు పైకప్పు లేకుండా పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట నిద్రించేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. బాధితుడు రవికుమార్ మాట్లాడుతూ, తమను ప్రభుత్వం ఆదుకోవాలని నష్టపరిహారం అందించి తిరిగి ఇంటిని బాగుచేసుకునేందుకు సహకరించాలని వేడుకున్నాడు. గ్రామస్తులు, స్థానిక నాయకులు రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి పంచనామా నిర్వహించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

## బోర్ సమస్య తీర్చిన కాంగ్రెస్ లీడర్: రాజేష్ యాదవ్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో సామాన్యుల బాధలు వర్ణనాతీతం.మరీ ముఖ్యంగా బస్తీల్లో ఉండే ప్రజలు మౌళిక సదుపాయాల విషయంలో అధికారుల వైఫల్యాలను ఎండకడుతున్నారు.ఇదిలా ఉండగా మరో పక్క నగరంలో ఎండల తీవ్రత రోజు రోజుకు పెరిగి ప్రాణాలపై ప్రభావం చూపుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో గత కొన్ని రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న మూడో వార్డులో పర్యటించినప్పుడు పలు ప్రాంతాల్లో మౌళిక సమస్యలు ఆయన దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు.ఈ నేపథ్యంలో నిన్న ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బాలంరాయి వార్డు మూడులో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలు,తక్కువ వాటర్ ప్రెషర్ సమస్యల పరిష్కారార్థం పాత బోర్‌ను మరమ్మతులు చేసి నూతన బోర్‌ను ఏర్పాటు చేయించారు స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టి పిసిసి సెక్రటరీ రాజేష్ యాదవ్.గత వారం ప్రజలు తెలిపిన సమస్యల పై స్పందించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్ సంబంధిత అధికారులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించగా,ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే దిశగా పనులను పూర్తి చేసి నిన్న మంగళవారం ఉదయం ప్రారంభించారు.అదే విధంగా కాలనీ పరిసరాల్లో భూగర్భ సమస్యలు,విద్యుత్ వైర్లు గాల్లో వెలాడడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకి గురి కాకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులకు రాజేష్ యాదవ్ సూచనలు చేశారు.అలాగే ప్రాథమిక సమస్యలను పరిశీలించి, వాటిని ఎమ్మెల్యే శ్రీ గణేష్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్థానిక ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది.బోర్ సమస్య తీరడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.ఎమ్మెల్యే శ్రీ గణేష్, స్థానిక నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు బస్తీ వాసులు.

# మత్స్యకార సేవ పథకం



శ్రీకాళహస్తి.(ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మత్స్యకార సేవ పథకం కింద చేపల వేట నిషేధ కాల ఉపశమనానికి రూ.20,000 చొప్పున ఆర్థిక సాయం 2026-27 సంవత్సరానికి జిల్లాలోని 3,099 మంది మత్స్యకారులకు రూ.6.19 కోట్ల ఐదీ చెల్లింపులు ఇంచార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మత్స్యకారుల కోసం ప్రభుత్వ భరోసా జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తమిళనాడు సరిహద్దు గస్తీ బలోపేతం మత్స్యకారుల సంక్షేమం కోసం కఠిన చర్యలు జిల్లా ఎస్ పి ఎల్. సుబ్బారాయుడు మత్స్యకార సేవలో పథకం కింద చేపల వేట నిషేధ కాలంలో జీవనోపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోందని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం మత్స్యకార సేవలో కార్యక్రమన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లా కావలి మండలం తుమ్మలపెంట గ్రామం నుండి లాంఛనంగా ప్రారంభించగా జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పి ఎల్. సుబ్బారాయుడు, చంద్రగిరి, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి, సత్యవేడు ఎంఎల్ఏ లు పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, పాశం సునీల్ కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, ఆదిమూలం, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, తదితరులు వర్చువల్ గా పాల్గొన్నారు.

# అత్తెల్లి ప్రవీణ్-జ్యోతి దంపతుల మృతి బాధాకరం :చాగండ్ల నరేంద్రనాథ్

**మృతుల కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం**

**శోకసముద్రంగా మారిన షేర్‌పల్లి గ్రామం**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం షేర్‌పల్లి గ్రామానికి చెందిన ఆర్యవైశ్య నాయకుడు అత్తెల్లి ప్రవీణ్, ఆయన భార్య జ్యోతి దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదానికి గురిచేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగండ్ల నరేంద్రనాథ్ అన్నారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అత్తెల్లి ప్రవీణ్ మరణం తనకు వ్యక్తిగతంగా తీరని లోటని, ఎంతో ఆత్మీయుడైన మంచి మనిషిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. చిన్న వయసులోనే దంపతులు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడం అందరినీ కలచివేసిందన్నారు. వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ ఘటనతో షేర్‌పల్లి గ్రామం శోకసముద్రంగా మారింది. ఈ పరామర్శ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, నాయకులు దుర్గాప్రసాద్, తుమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సుందరయ్య స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాడాలి

**- మత విద్వేషాలతో బీజేపీ రాజకీయాలు**

**- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు : టి.స్కైలాబ్ బాబు**




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని బోయినిపల్లి మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో సుందరయ్య చిత్రపటాలతో ప్రదర్శన చేపట్టి, సీపీఎం అరుణ పతాకాన్ని ఎగురవేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్ఎంపీ--పీఎంపీ భవన్‌లో "కార్మిక వర్గ ఐక్యత--సవాళ్లు, కర్తవ్యాలు" అంశంపై సదస్సు నిర్వహించారు.సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.స్కైలాబ్ బాబు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల ఐక్యతను దెబ్బతీస్తోందన్నారు.

సుందరయ్య స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సుందరయ్య కీలక పాత్ర పోషించారని, కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానేత అని కొనియాడారు.సీపీఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విజ్ఞాన దర్శిని రాష్ట్ర అధ్యక్షులు బొల్లి ఆధామ్ రాజ్, సీపీఎం నాయకులు రామంచ అశోక్, కుడుకల గిరిబాబు, కొత్తూరు నరసయ్య, అల్వాల అంజయ్య, ఎడపల్లి బాబు, బొజ్జ శ్రీను, అనుముల రవి, ఆవుల మల్లయ్య, కోరెన్ మహేష్, రాజనర్సు, పాటల గోపి తదితరులు పాల్గొన్నారు.

# నిండిపోయిన మోరీలను తక్షణమే శుభ్రం చేయాలి

**- బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నర్సింగరావు**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాత 9వ వార్డు (ప్రస్తుత 17వ వార్డు)లో నిండిపోయిన డ్రైనేజీలను వెంటనే శుభ్రం చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నర్సింగరావు మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. వార్డులోని పలు ప్రాంతాల్లో మోరీలు పూర్తిగా పూడుకుపోవడంతో మురుగునీరు సరిగా పారక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. గత కొన్నేళ్లుగా డ్రైనేజీల శుభ్రతపై అధికారులు నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. ప్రత్యేకంగా చిక్కుడు బస్తీ, సరస్వతి శిశు మందిర్ సమీపం, రిజిస్ట్రేషన్ ఆఫీస్ పరిసరాలు, కోట మైసమ్మ దేవాలయం వద్ద బాబా గౌడ్ ఇంటి పక్క ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వ్యాపించి ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పరిస్థితి మరింత విషమించకముందే మున్సిపల్ కమిషనర్ తక్షణ చర్యలు తీసుకుని ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మోరీలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయించాలని నర్సింగరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య చర్యలను వేగవంతం చేయాలని ఆయన కోరారు.

# ప్రభుత్వ పార్క్ భూమి కబ్జా

**- అడ్డగుట్టలో అక్రమ నిర్మాణం జోరుగా సాగుతున్నా అధికారుల మౌనం**

**- ఫిర్యాదులు చేసినా స్పందన శూన్యం**

**- జిహెచ్ఎంసి, రెవెన్యూ అధికారులపై స్థానికుల తీవ్ర ఆరోపణలు**





**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ భూములు, పార్క్ స్థలాలు ప్రజల కోసం కేటాయిస్తే, వాటిని కాపాడాల్సిన అధికారులే కళ్లు మూసుకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో అడ్డగుట్ట డివిజన్‌లో జరుగుతున్న ఘటన చూస్తే అర్థమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. అడ్డగుట్ట డివిజన్ పరిధిలోని సర్వే నెంబర్ 74/6లో ప్రభుత్వానికి చెందిన పార్క్ స్థలాన్ని కబ్జా చేసి భారీగా అక్రమ నిర్మాణం కొనసాగుతుండటంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మాణ పనులు బహిరంగంగా సాగుతున్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, పార్క్ కోసం కేటాయించిన స్థలంలో కొంతకాలంగా దశలవారీగా ఆక్రమణలు ప్రారంభమయ్యాయని, ఇటీవల వాటిని మరింత విస్తరించి భారీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని పేర్కొంటున్నారు. నగరంలో చాలావరకు జిహెచ్ఎంసి అనుమతులు లేకుండానే కాంక్రీట్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఇప్పటివరకు ఒక్క నోటీసు కూడా ఇవ్వలేదని మండిపడుతున్నారు.

### ఫిర్యాదులు చేస్తే ఫైళ్లలోనే పాతిపెడుతున్నారు

అక్రమ నిర్మాణంపై ఇప్పటికే జిహెచ్ఎంసి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయానికి పలుమార్లు ఫిర్యాదులు అందాయని స్థానికులు చెబుతున్నారు. ఫోటోలు, వీడియోలతో సహా పూర్తి ఆధారాలు ఇచ్చినా అధికారులు మాత్రం అసలు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. సాధారణ ప్రజలు చిన్న షెడ్ వేసినా వెంటనే కూల్చివేతలు చేసే అధికారులు, ఇక్కడ ప్రభుత్వ పార్క్ స్థలం కొంత భాగం కబ్జా చేసి భారీ నిర్మాణం జరుగుతున్నా ఎందుకు మౌనంగా ఉన్నారు.? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇక రెవెన్యూ శాఖ అధికారుల వ్యవహారంపై కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు ఆక్రమణదారుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, ఈ వ్యవహారంలో లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయా.? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

### ఏసీబీకి ఫిర్యాదు.. అయిన పనులు ఆగలేదు

సికింద్రాబాద్ జోన్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల వ్యవహారంపై ఏసీబీ అధికారులకు, ముఖ్యంగా జోనల్, డిప్యూటీ కమిషనర్లకు కూడా ఫిర్యాదు అందినట్లు సమాచారం. అయినప్పటికీ నిర్మాణ పనులు యథావిధిగా కొనసాగుతుండటంతో ప్రజల్లో మరింత అనుమానాలు పెరుగుతున్నాయి. ఫిర్యాదులు వెళ్లినా చర్యలు లేకపోవడం వెనుక రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నాయా.? అనే చర్చ స్థానికంగా జరుగుతోంది.

### అధికారులను బెదిరిస్తునారా.?

ఇంకా సంచలన విషయం ఏమిటంటే, అక్రమ నిర్మాణం వద్దకు వెళ్లిన జిహెచ్ఎంసి అధికారులను సదరు నిర్మాణదారుడు బెదిరింపులకు గురి చేస్తున్నాడని మున్సిపల్ సిబ్బంది, స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనితో అధికారులు కూడా చర్యలు తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే భయపడే పరిస్థితి ఏర్పడితే సామాన్య ప్రజలకు రక్షణ ఎక్కడ అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### ప్రభుత్వ భూములు కాపాడలేకపోతే ప్రజలకు న్యాయం ఎలా.?

సికింద్రాబాద్ నియోజకవర్గంలో పార్క్ స్థలాలు ప్రజల ఆరోగ్యం, పిల్లల ఆటస్థలాల కోసం కేటాయిస్తే అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ వాటిని అక్రమ నిర్మాణాలకు వదిలేయడం దారుణమని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అక్రమ నిర్మాణాన్ని నిలిపివేసి, ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని, బాధ్యులైన పార్కు స్థలం కబ్జా దారునిపై, అధికారులపై కూడా విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు కబ్జాలకు గురవుతుంటే చూస్తూ ఊరుకునే అధికారుల వైఖరి ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. ఇప్పటికైనా సికింద్రాబాద్ జోన్ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా.? లేక అక్రమార్కులకే అధికార వ్యవస్థ తలవంచుతుందా.? అనే ప్రశ్నలు ప్రజల్లో తీవ్రంగా వినిపిస్తున్నాయి.

# రైతుల పంటలు కొనలేని కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగాలి

**- వంటేరు ప్రతాప్ రెడ్డి - కొనుగోళ్లలో జాప్యం రైతులపై శాపంగా మారింది**

**- ఆంక్షలు లేకుండా ధాన్యం కొనాలి**

**- లేదంటే రాజీవ్ రహదారి దిగ్బంధం**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ మార్కెట్ యార్డులో వరి, పొద్దుతిరుగుడు పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులుగజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం, పొద్దుతిరుగుడు పంటలను గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి పరిశీలించారు. రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తూకాలు, కొనుగోలు ప్రక్రియ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరుగాలం శ్రమించిన రైతులకు చివరికి కన్నీళ్లు మాత్రమే మిగిలాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 45 డిగ్రీల ఎండలో రైతులు ధాన్యం కొనుగోలు కోసం రోజుల తరబడి పడిగాపులు కాయడం దారుణమన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో వరి లారీలతో యార్డులు నిండిపోయినా రోజుకు ఒక్క లారీ కూడా పంపకపోవడం రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. అధికారులు, రైస్ మిల్లర్లు, దళారులు కుమ్మక్కై రైతులను ఆంక్షల పేరుతో నట్టేట ముంచుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని, కొనుగోళ్లలో నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని విమర్శించారు. రైతుల పంటలను ఆంక్షలు లేకుండా గిట్టుబాటు ధరకు వెంటనే కొనుగోలు చేయాలని, లేదంటే వేలాది మంది రైతులతో కలిసి రాజీవ్ రహదారిపై దిగ్బంధం చేసి వంటావార్పు కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మేరా, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, మాజీ జెడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య, కౌన్సిలర్లు మామిడి శ్రీధర్, కాముని మురళి, కోట బాబు, మమతా పోచయ్య, మాజీ కౌన్సిలర్ మరికంటి కనకయ్య, సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధితో ఎన్నో అవకాశాలు



**రాజన్న సిరిసిల్ల** నైపుణ్యాభివృద్ధితో ఎన్నో అవకాశాలు వస్తాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం నైపుణ్యాభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జయ జయహే తెలంగాణ పాటను వినిపించారు. ఈ సందర్భంగా వివిధ శిక్షణ సంస్థలు ఐటీఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, ఆర్ సేటీ, జీఎంఆర్, ఐడీటీఆర్, టాస్క్, ఇతర సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి.. ఏ ఏ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు? అర్హత ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో నేటి యువత, విద్యార్థులు చాలా కీలకమని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటీవల విద్యా శాఖ వారోత్సవాల కింద సమ్మర్ క్యాంపులు నిర్వహించామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఎన్నో అంశాల్లో ప్రతిభ చూపారని గుర్తు చేశారు. విద్యతోపాటు ఆటలు ఆడాలని, దీంతో శారీరక, మానసిక సమతుల్యత ఉంటుందని, క్రమ శిక్షణ అలవడుతుందని వివరించారు. ఉన్నత చదువుతోపాటు టెక్నికల్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. ఇప్పటి పరిశ్రమలకు ఎలాంటి స్కిల్స్ అవసరమో తెలుసుకొని ఆ దిశలో ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. ఐటీఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, ఆర్ సేటీ, జీఎంఆర్, ఐడీటీఆర్, టాస్క్ తదితర సంస్థల్లో అందిస్తున్న ఉచిత శిక్షణ కోర్సులను సద్విని యోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. పూర్తి వివరాలకు ఆయా సంస్థల్లో సంప్రదించాలని సూచించారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లో శిక్షణ పొందిన వారికి పలు సంస్థలు ఉపాధి కల్పిస్తాయని తెలిపారు. పరిశ్రమల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అందిస్తున్న స్వయం ఉపాధి స్కీములు, సబ్సిడీ సద్వినియోగం చేసుకొని.. స్వయం యువత ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. జిల్లాలోని వివిధ శిక్షణ సంస్థలు ఏడాది అంతా యువతకు శిక్షణ అందించేలా ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్లాలని సూచించారు. నర్సింగ్ పూర్తి చేసి.. విదేశాల భాష, నైపుణ్యాల్లో పట్టు ఉన్న వారికి టామ్ కామ్ ఆధ్వర్యంలో వివిధ దేశాల్లో ఉపాధి కల్పన అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. జిల్లా నుంచి ఇప్పటిదాకా 45 మందికి విదేశాల్లో కొలువులు వచ్చాయని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. యువత ఉపాధిని పొంది తమ తల్లితండ్రుల సంరక్షణ బాధ్యతను చూసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, జీఎం ఇండస్ట్రీస్ హనుమంతు, డీవైఎస్ఓ రాందాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఎల్డీఎం మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



**రుద్రవరం** మండల కేంద్రం రుద్రవరంలో మంగళవారం 'బడి పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుపేటలో విద్యార్థుల చేరికలపై ఉపాధ్యాయులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహిమాన్ మాట్లాడుతూ... "5 సంవత్సరాలు నిండిన ప్రతి బిడ్డను ప్రభుత్వ బడిలో చేర్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. బడి వయసు పిల్లలెవరూ బడికి దూరం కాకూడదని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు, యూనిఫార్ములు, షూస్, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం మరియు డిజిటల్ బోధన వంటి అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయని, ప్రైవేట్‌కు దీటుగా లభిస్తున్న ఈ నాణ్యమైన విద్యను తల్లిదండ్రులంతా సద్వినియోగం చేసుకొని, తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగవీణ, ఎంపీడీఓ ఎస్. భాగ్యలక్ష్మి, ఎంఈఓ-ఎ ఎం. వెంకటస్వామి రెడ్డి, ఎంఈఓ-ఎఎ ఎన్. లక్ష్మి, హెచ్ఎం ఎన్. వెంకటరమణ, ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల మరియు అంగన్వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బడి పిలుస్తోంది కార్యక్రమం

**చాగలమర్రి** చాగలమర్రిలోని గుంత పాలెం వీధి నందు పి ఆర్ టి యు మండల పరిషత్ ప్రైమరీ పాఠశాల వారి ఆధ్వర్యంలో బడి పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని వారికి ఉచితంగా ఆంగ్ల విద్యా , ఉచిత పుస్తకాలు, ఉచిత యూనిఫాంలు, మధ్యాహ్నం ఉచిత భోజన సౌకర్యం వంటి వాటి గురించి తెలియజేస్తూ పిల్లల పేర్లు నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి న్యామతుల్లా, పిఆర్టియు రాష్ట్ర కౌన్సిలర్ బి రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు మస్తాన్, లక్ష్మయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

# రుద్రవరంలో నేడు మెడికల్ షాపుల బంద్!



**రుద్రవరం.**ఆల్ ఇండియా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ పిలుపు మేరకు నేడు (మే 20) నిర్వహించబోయే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా రుద్రవరం మండలంలోని మెడికల్ షాపుల యజమానులు బంద్‌కు పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ మందుల అమ్మకాలను, కార్పొరేట్ సంస్థల భారీ డిస్కౌంట్లను నిలిపివేయాలని, అలాగే నకిలీ మందుల అమ్మకాలను పూర్తిగా అరికట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మండల మెడికల్ షాపుల యజమానులు స్థానిక తాసిల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ నాగ శేషయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాప్ యజమానులు టంగుటూరు శ్రీను, గుండా వీరయ్య, పెరుమాళ్ళ వెంకట సుబ్రమణ్యం, రాచమడుగు సతీష్, ఎంద్రపల్లి ప్రభాకర్, పవన్ తదితర మెడికల్ షాపుల యజమానులు పాల్గొన్నారు. సమ్మె కారణంగా రోగులకు కలిగే అసౌకర్యానికి తాము విచారిస్తున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు.

## పారంశెట్టి సూర్యచంద్రపై

# చట్టపరమైన చర్యలు చేపట్టాలి

**- దళిత నాయకుడి పై దాడి చేసిన పారంశెట్టిని అరెస్టు చేయాలి**

**- దళిత నాయకులు ,మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్ డిమాండ్**



**గోకవరం** టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ పర్యటన భాగంగా బూరుగుపూడిలో దళిత నాయకుడు మురా సత్తిబాబు ప్రసారం చేస్తుండగా ఓర్వలేని పారం శెట్టి సూర్యచంద్ర కక్షపూరితంగా దాడి చేశాడని, చెప్పుతో కొట్టి, కులం పేరుతో బహిరంగంగా దూషించాడని అందుకు పారంశెట్టిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని దళిత నాయకులు, గోకవరం మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు స్థానిక టిడిపి కార్యాలయం నందు భరత్ మీడియా సమావేశం నిర్వహించి, పారం శెట్టి ఆగడాలను ఎండగట్టారు. అగ్రకుల అహంకారానికి ఇది పరాకాష్టని, రాజ్యాంగ స్ఫూర్తికి, సామాజిక న్యాయానికి వ్యతిరేకమని భరత్ అన్నారు. మంత్రి నారా లోకేష్ పర్యటన విజయవంతం అయితే జగ్గంపేట సస్యశ్యామలంగా మారుతుందని , అందుకునే పారం శెట్టి ఓర్వలేక టిడిపిని, స్థానిక ఎమ్మెల్యేను అగౌరవపరిచే విధంగా ప్రవర్తించడం జరిగిందన్నారు. నిందితుడు పారంశెట్టి సూర్యచంద్రను 24 గంటల్లో అరెస్టు చేయాలని,బాధితుడికి రక్షణ మురా సత్తిబాబుకు పోలీసు రక్షణ కల్పించి, చట్ట ప్రకారం నష్టపరిహారం అందేలా చూడాలని భరత్ డిమాండ్ చేశారు. 48 గంటల్లో నిందితుడిని అరెస్టు చేయకపోతే, జిల్లా వ్యాప్తంగా దళిత సంఘాలు రోడ్లపైకి వస్తాయని భరత్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ పిట్ట అరుణ్ కుమార్, పల్ల నరేష్, గునిపే భీమరాజు, జక్కల చిన్ని, చీకట్ల శ్రీను,మోటపర్తి ఆనంద్,ఆకాశపు కిరణ్, కొల్లపు చంటి, గునిపే భాను, కడుగుల వెంకటరమణ, ఉల్లి బంగారయ్య,నరిసెట్టి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## 'బ్యాడ్ బాయ్ కార్తీక్'
# మూవీ రివ్యూ!



తెలుగు తెరపై హ్యాండ్ సమ్ కటౌట్ గా కనిపించే హీరోలలో నాగశౌర్య ఒకరు. ఆరంభంలోనే వరుస విజయాలను అందుకుంటూ వచ్చిన నాగశౌర్య, ఆ తరువాత లవర్ బాయ్ ఇమేజ్ నుంచి బయటకి రావడం కోసం, యాక్షన్ పాళ్లు ఎక్కువగా ఉన్న కథలను ఎంచుకుంటూ వచ్చాడు. అలా ఆయన చేసిన సినిమానే 'బ్యాడ్ బాయ్ కార్తీక్'. ఏప్రిల్ 17వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ నెల 15వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది. కార్తీక్ (నాగశౌర్య) తన అక్కయ్య కస్తూరి (శ్రీదేవి విజయ్ కుమార్) ... బావ వాసు (అజయ్)తో కలిసి 'వైజాగ్' లో నివసిస్తూ ఉంటాడు. శ్రీదేవి అడ్వకేట్ గా పనిచేస్తూ ఉంటుంది. అదే వైజాగ్ లో సాయి విక్రమ్ (సాయి కుమార్) పోలీస్ ఆఫీసర్ గా ఉంటాడు. ఆయన కూతురు 'మహా' (విధి యాదవ్)ను కార్తీక్ ఇష్టపడుతూ ఉంటాడు. బీటెక్ పూర్తిచేసిన కార్తీక్, ఊళ్లో అల్లర చిల్లరగా తిరుగుతూ ఉండటంతో, అతణ్ణి పై చదువుల కోసం ఫారిన్ పంపించాలనే ఆలోచనలో కస్తూరి ఉంటుంది. 'కదిరి'లో వరదారెడ్డి (సముద్రఖని) గోవిందప్ప (మైమ్ గోపీ) మధ్య ఫ్యాక్షన్ గొడవలు నడుస్తూ ఉంటాయి. వరదారెడ్డి చెల్లెలు గోవిందప్ప అన్నయ్య మునెప్పను ప్రేమిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న వరదారెడ్డి, తన వాళ్లతో మునెప్పను చంపిస్తాడు. అప్పటి నుంచి వరదారెడ్డిపై ప్రతీకారంతో గోవిందప్ప రగిలిపోతుంటాడు. సరైన సమయం కోసం అతను వెయిట్ చేస్తూ ఉంటాడు. ఈ నేపథ్యంలోనే తన అక్కయ్య కస్తూరిని హత్య చేయించడానికి గోవిందప్ప ప్రయత్నిస్తున్న విషయం కార్తీక్ కి తెలుస్తుంది. అందుకు గల కారణం ఏమిటనేది తెలుసుకోవడం కోసం, కార్తీక్ వైజాగ్ నుంచి కదిరి వెళతాడు. అక్కడ ఏం జరుగుతుంది? కస్తూరి పై గోవిందప్పకి గల కోపానికి కారణం ఏమిటి? వరదారెడ్డితో ముడిపడిన ఆ అక్కాతమ్ముళ్ల గతం ఎలాంటిది? అనేది కథ. ఈ కథ వైజాగ్ - కదిరి మధ్య జరుగుతుంది. ఇది అక్కాతమ్ముళ్ల ఎమోషన్స్ కి సంబంధించిన కథ. ఈ రెండు పాత్రలతో పాటు అంతే ప్రధానమైనవిగా వరదారెడ్డి - గోవిందప్ప పాత్రలు కనిపిస్తాయి. ఈ నాలుగు పాత్రలను ప్రధానంగా చేసుకునే ఈ కథ ముందుకు వెళుతూ ఉంటుంది. ఇక ఆ తరువాత స్థానంలో సాయికుమార్ .. అతని కూతురు మహా (హీరోయిన్) పాత్రలు ముఖ్యమైనవిగా దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు. ఒక వైపున వైజాగ్ లో తమ్ముడు గురించి అక్క ఆందోళన చెందుతూ ఉంటుంది. మరో వైపున కదిరిలో విలన్స్ మధ్య గొడవగా ఉంటుంది. ఈ రెండు ట్రాకుల మధ్య సంబంధం ఉందనే విషయాన్ని దర్శకుడు హింట్ ఇస్తూ వెళుతుంటాడు. ఆ ఫ్లాష్ బ్యాక్ ఏమిటనేది తెలుసుకోవాలనే కుతూహలంతో ప్రేక్షకులు ఉంటారు. దర్శకుడు ఈ విషయాన్ని రివీల్ చేసిన తీరు కూడా బాగుంది .. ఆ ట్విస్ట్ చాలా కీలకమైనదని కూడా అనిపిస్తుంది. ఇంటర్వెల్ బ్యాంగ్ .. ఆ తరువాత కథపై ఆసక్తిని పెంచేదిలా ఉంటుంది. సెకండాఫ్ లో కార్తీక్ కోసం వరదారెడ్డి అనుచరులు గాలించడం .. అక్కాతమ్ముళ్ల ఫ్లాష్ బ్యాక్ రివీల్ అయ్యేవరకూ బాగానే అనిపిస్తుంది. ఇక ఎప్పుడైతే వెన్నెల కిశోర్ ఎంట్రీ ఇస్తాడో అప్పటి నుంచి కథ కాస్త కామెడీ వైపు టర్న్ తీసుకుని చప్పబడిపోయినట్టుగా అనిపిస్తుంది. నాగశౌర్య పాత్రను, సముద్రఖని .. మైమ్ గోపీ పాత్రలను డిజైన్ చేసిన తీరు బాగుంది. వాళ్ల నటన కూడా బాగుంది. కార్తీక్ .. అతని లవర్ కి సంబంధించిన రొమాన్స్ కి అవకాశం లేకుండా చేశారు. అందువలన ఆ వైపు నుంచి ఆడియన్స్ కి మిగిలేది నిరాశే. ఇక సాయికుమార్ పాత్రను డిజైన్ చేయడంలో కూడా క్లారిటీ లేదనిపిస్తుంది. అలాగే ఎలాంటి విషయం లేకుండా అజయ్ పాత్రను వదిలేశారు. రసూల్ ఎల్లోర్ ఫొటోగ్రఫీ బాగుంది. హారీస్ జైరాజ్ సంగీతం ఫరవాలేదు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ ఓకే. కథలోని అక్కాతమ్ముళ్ల ఫ్లాష్ బ్యాక్ కి సంబంధించిన ట్విస్ట్ బాగుంది. కానీ ఎమోషన్స్ వైపు నుంచి .. యాక్షన్ వైపు నుంచి నడిచే డ్రామా రొటీన్ గా అనిపిస్తుంది. రొమాన్స్ కి ఛాన్స్ ఇవ్వకపోవడం మరో లోపంగా అనిపిస్తుంది.

## ప్రతిసారి మగాడిదే
# తప్పని చెప్పలేం

### - జయం రవికి అండగా మీరా చోప్రా



తమిళ చిత్ర పరిశ్రమలో (కోలీవుడ్) నటుడు జయం రవి విడాకుల వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారడమే కాకుండా, పరిశ్రమలోని ప్రముఖులు ఆయనకు అనుకూలంగా, వ్యతిరేకంగా చీలిపోయే పరిస్థితిని తెచ్చింది. విడాకులు మంజూరయ్యే వరకు తాను సినిమాల్లో నటించనని, తన చిత్రాలను విడుదల చేయనివ్వనని జయం రవి ప్రకటించడం, పెళ్లయిన నాటి నుంచి తాను నరకం అనుభవించానని మీడియా ముందు కన్నీరు పెట్టుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. దీనికి తోడు, జయం రవితో లింక్ చేస్తూ ప్రచారంలోకి వచ్చిన గాయని కెనీషా.. నాటకీయంగా ఆయనతో తన అనుబంధానికి ఫుల్ స్టాప్ పెట్టేశానని ప్రకటించింది. మరోవైపు జయం రవి భార్య ఆర్తి 'నిద్రపోతున్న సింహాన్ని లేపవద్దు' అంటూ హెచ్చరించడం, ఆమెకు సీనియర్ నటి ఖుష్బూ మద్దతుగా నిలవడంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో ఒకప్పటి కథానాయిక మీరా చోప్రా జయం రవికి బాసటగా నిలుస్తూ సోషల్ మీడియా వేదికగా రంగంలోకి దిగడం ఆసక్తికరంగా మారింది. జయం రవితో సౌత్ సినిమాల్లో నటించే సమయం నుంచి తనకు మంచి పరిచయం ఉందని మీరా చోప్రా గుర్తుచేసుకున్నారు. జయం రవి విడాకుల వార్తలపై స్పందిస్తూ.. "ప్రతిసారి తప్పు మగవాడిదే అని చెప్పలేం. మహిళల పక్షాన ఉన్న చట్టాలను కొందరు దుర్వినియోగం చేస్తున్న సందర్భాలను కూడా నేను చూశాను. కాబట్టి పురుషుడి వైపు ఉన్న వాదనను కూడా వినాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నాకు తెలిసినంత వరకు జయం రవి చాలా మంచి వ్యక్తి. ఆయన విషయంలో నిజం గెలుస్తుందని, న్యాయం దక్కుతుందని ఆశిస్తున్నాను" అని ఎక్స్ వేదికగా జయం రవికి పూర్తి మద్దతు ప్రకటించారు. మీరా చోప్రా సినీ నేపథ్యం: దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఎస్.జె. సూర్య దర్శకత్వంలో వచ్చిన 'అన్బే ఆరుయిరే' చిత్రంతో మీరా చోప్రా కోలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత తెలుగులో 'బంగారం', 'వాన' వంటి పలు చిత్రాల్లో నటించి మెప్పించారు. గతంలో ఒక సినిమా దర్శక, నిర్మాతలపై ఆమె చేసిన పోరాటం అప్పట్లో మీడియాలో పెద్ద సంచలనంగా మారింది. ఆ తర్వాత దక్షిణాది చిత్రాలకు దూరమై బాలీవుడ్ (హిందీ) వైపు దృష్టి సారించిన ఆమె, ఇటీవల విడుదలైన సైలెంట్ మూవీ 'గాంధీ టాక్స్'కు నిర్మాణ భాగస్వామిగా కూడా వ్యవహరించారు.

## గర్ల్‌ఫ్రెండ్ అంటే బానిస కాదు



ప్రముఖ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు దర్శకత్వంలో సుధీర్‌రాజు, డి.వైష్ణవి నేహా నిర్మిస్తున్న చిత్రం 'లలిత'. 'గర్ల్‌ఫ్రెండ్ అంటే బానిస కాదు' అనేది ఉపశీర్షిక. అభిలాష్ పీలా, అఖిల్ వివాస్, నందిని ప్రధానపాత్రధారులు. వ్యక్తిత్వం కోసం నిలబడే ఓ మహిళ కథగా ఈ చిత్రం రూపొందిందని, సామాజిక నేపథ్యంతో సందేశాత్మకంగా ఈ సినిమా సాగుతుందని మేకర్స్ వెల్లడించారు. రఘుబాబు, పృథ్వీరాజ్, తాగుబోతు రమేశ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: టి.సురేంద్రరెడ్డి, సంగీతం: మణి, నాగరాజు, నిర్మాణం: కాస్మిక్ పవర్ క్రియేట్స్ ఎల్ఎల్‌పీ.

## దశాబ్దంలో ఒకసారి వచ్చే సినిమా

'మాటలతో కాదు..ఆటతో బరిలో గెలిచే మగతనం ఎవరికి ఉందో రమ్మను..' అంటూ ప్రత్యర్థులకు సవాలు విసురుతున్నాడు ఆటకూలీ పెద్ది. మరి ఆయన పోరు ఎవరి మీదో చూచాయగా తెలుసుకోవాలంటే ట్రైలర్ మీద ఓ లుక్కేయాల్సిందే. మెగాభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న రామ్‌చరణ్ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' థియేట్రికల్ ట్రైలర్‌ను సోమవారం ముంబయిలో విడుదల చేశారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ట్రైన్ సీక్వెన్స్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఎమోషనల్‌గా సాగింది. పెద్ది తాలూకు ప్రపంచాన్ని పరిచయం చేయడం, అతన్ని క్రికెటర్‌గా, కుస్తీ యోధుడిగా, పరుగుల వీరుడిగా..ఇలా భిన్న ఆటల్లో ప్రావీణ్యం ఉన్నవాడిగా చూపించడం ఆసక్తిని పెంచింది. 'మీరు అందరూ నేను ఆడానని అనుకుంటున్నారు.. కానీ నేను పోరాడాను' అంటూ పెద్ది చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. రామ్‌చరణ్ మాట్లాడుతూ 'ఇది చాలా నిజాయితీగా చేసిన సినిమా. ఓ యువకుడు గుర్తింపు కోసం చేసే ప్రయాణమిది. నా కెరీర్‌లో అత్యంత స్ఫూర్తివంతమైన సినిమా. ఇలాంటి సినిమాలు దశాబ్దంలో ఒకసారి మాత్రమే వస్తాయి. మగధీర, రంగస్థలం, ఆర్.ఆర్.ఆర్ లాంటి సినిమాలు తరచుగా రావు. 'పెద్ది' కూడా అలాంటి సినిమానే. నా లైబ్రరీలో ఎప్పటికీ దాచుకునే సినిమా' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మించారు. జాన్వీకపూర్, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందుశర్మ, బొమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రధారులు. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.



# కాక్‌టెయిల్ -2
## ఓ విభిన్నమైన ప్రేమకథ



రష్మిక మందన్న ప్రస్తుతం ముంబైలో బిజీబిజీగా ఉన్నారు. షాహిద్ కపూర్, కృతిసనన్‌లతో కలిసి ఆమె నటించిన 'కాక్‌టెయిల్ 2' చిత్రం జూన్ 19న విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా గడుపుతున్నది రష్మిక మందన్న. తాజాగా ముంబైలో ఈ చిత్రబృందం ఓ మ్యూజికల్ ఈవెంట్‌ని నిర్వహించింది. ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ "కాక్‌టెయిల్ 2' ఊహలకు అందనంత గొప్పగా ఉంటుంది. ఇది చాలా భిన్నమైన సినిమా. ఈ డిఫరెంట్ ప్రేమకథను అందరూ ఎంజాయ్ చేస్తారు. కృతిసనన్ మామూలుగానే చాలా హాట్. ఈ సినిమాలో మరింత అందంగా కనిపిస్తుంది. షాహిద్‌తో మా ఇద్దరి కెమిస్ట్రీ ఓ రేంజ్‌లో ఉంటుంది. ట్రైలర్స్, టీజర్స్‌లో మీరు చూసింది చాలా తక్కువ. అసలు అప్‌డేట్స్ ముందున్నాయి. వాటికోసం మీతోపాటు నేనూ ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా' అంటూ చెప్పుకొచ్చింది రష్మిక. ఇక 'కాక్‌టెయిల్ 2' సినిమా విషయానికొస్తే.. ఇదొక త్రిముఖ ప్రేమకథ అని తెలుస్తున్నది. హోమీ అదజానియా దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందించారు.

## మత విద్వేషాల డిప్యూటీ స్పీకర్ ఆర్.ఆర్.రాజును శాసన సభ నుండి తక్షణమే బర్తరఫ్ చేయాలి : పాస్టర్ జేమ్స్ కుంపట్ల




విజయవాడ(ప్రశ్న న్యూస్) తెలుగుదేశం పార్టీ ఉండి నియోజక ఎమ్మెల్యే ఆంద్రప్రదేశ్ శాసన సభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘు రామ కృష్ణం రాజు క్రైస్తవ మైనార్టీలపై అనుచిత వాఖ్యలు చేయడం అవమానపరచడం. ఫిర్యాదులు చేయడం దూషించడం జరుగుతుంది. డిప్యూటీ స్పీకర్ పదవి పొందిన నాటి నుండి క్రైస్తవ మైనార్టీలను లక్ష్యంగా గురిపెట్టి దాడులు చేయడం, మత విద్వేషాలతో అల్లర్లకు పాల్పడడం స్థానిక క్రైస్తవ భక్తుల ప్రార్ధన సమావేశ మందిరాలను వారి ఇళ్లను బుల్ డోజర్లతో రావటం కొంతమంది క్రైస్తవ నాయకులపై కేసులు, రౌడీ షీట్ పెట్టి వేధించడం ద్వారా రాష్ట్రంలో అశాంతి రాజకీయ కలకలం రేగడం విదితమే. ఈ మత రాజకీయ అసాంఘీక కార్యకలాపాలపై ముఖ్యమంత్రి ఇప్పటివరకు స్పందించక సహకరిస్తునట్లు అనిపిస్తుంది. ఇదే క్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు ఈ దాడుల్లో పాల్గొడమే కాకుండా మీటింగులు పెట్టి బహిరంగంగా ప్రోత్సహించడం జరుతుంది.

ఈ తరుణంలో ఏపి క్రిస్టియన్ మైనారిటీ సొసైటీ సభ్యులు పాస్టర్ జేమ్స్ కుంపట్ల,పాస్టర్ కర్రి ఈశ్వర్ డేనియల్,పాస్టర్ సేనాపతి హనీ జాన్సన్ భీమవరం కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోవడంతో నేడు ఆంద్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాసన సభ స్పీకర్ ఈ సమస్యను అరికట్టాలని వినతిపత్రం సమార్పిస్తూ త్వరలో ఏపి క్రిస్టియన్ మైనారిటీ సొసైటీ సభ్యులతో మరికొందరు క్రైస్తవ సమాజ నాయకులతో చర్చలు జరపాలని కోరారు పరిష్కారం గాని స్పందన గాని జరగని పక్షంలో తదుపరి ఢిల్లీలో రాష్ట్రంలో ధర్నా, ర్యాలీ, నిరసన కార్యక్రమాలు చేపట్టి కోర్టును ఆశ్రయించడం జరుగుతుందని తెలిపారు .ఈ కార్యక్రమంలో జి. అరుల్ అరుసు,కే.ఈశ్వర్ డేనియల్, ఎస్.హనీ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్లు ప్రజల జేబులు ఖాళీ చేసి
# ఇప్పుడు వైసీపీ డ్రామాలు

**- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**



**మంగళగిరి (ప్రశ్న న్యూస్)** పెట్రోలు, డీజిల్ ధరలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న ధర్నాలు చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందని, ఇదంతా ఒక పెద్ద డ్రామా అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో జరిగిన దోపిడీని ఎండగట్టారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, 2024కు ముందు పెట్రోల్, డీజిల్ ధరల్లో ఈ దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టారు. అడ్డగోలుగా రోడ్ సెస్ వేసి, వ్యాట్ పెంచి సామాన్య ప్రజలపై భారం మోపాడు. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు దేశవ్యాప్తంగా ఒక ?3 రూపాయలు, ఈరోజు ఒక 97 పైసలు పెంచిన మాట నిజమే. కానీ, దాన్ని పట్టుకుని మీరు ఈరోజు రోడ్లెక్కి ధర్నాలు చేస్తారా? అసలు ఆనాటి మీ బాదుడుకు, ఈనాటి మీ ధర్నాలకు ఏమైనా సంబంధం ఉందా అని విమర్శించారు. ఆనాడు జగన్ రెడ్డి పెంచిన ధరల వల్ల సరిహద్దు జిల్లాల ప్రజలు పడిన ఇబ్బందుల వివరించాడు. ఆ రోజుల్లో విజయవాడ, వైజాగ్‌లలో లీటర్ పెట్రోల్ ధర ?111.50 నుండి ?112 ఉండేది. అదే సమయంలో తెలంగాణలో ?109, కర్ణాటకలో ?101 మాత్రమే ఉండేది. అంటే మన పక్కనున్న కర్ణాటక కంటే ఏపీలో లీటర్‌కు ?11 రూపాయలు ఎక్కువ వసూలు చేశారు. నేను నా కుమారుడి ఇంటికి బెంగళూరుకు వెళ్లేటప్పుడు.. వస్తూ వస్తూ చిత్తూరు బార్డర్ అవతల ఉన్న కర్ణాటక లాస్ట్ పెట్రోల్ బంకులో కార్ ఫుల్ ట్యాంక్ చేయించుకుని వచ్చేవాడిని. ఎందుకంటే లీటర్‌కు ?11 మిగిలితే, ఒక 50 లీటర్లు కొట్టిస్తే ఇంచుమించు ?550 రూపాయలు మిగిలేవి. అంత దారుణంగా రాష్ట్రాన్ని లూటీ చేశారు. వైసీపీ హయాంలో ఆంధ్రాలో డీజిల్ ధర ?99.50 ఉంటే, కర్ణాటకలో ?87.89, తెలంగాణలో ?97.82, తమిళనాడులో మనకంటే ?5 తక్కువగా ఉండేది. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఈ రెండు సంవత్సరాల కూటమి ప్రభుత్వంలో పెట్రోల్ మీద గానీ, డీజిల్ మీద గానీ ఒక్కటంటే ఒక్క పైసా కూడా రేటు పెంచలేదు. అసలు ధరలు పెంచింది మనమే కదా, ఇప్పుడు ఈ ధర్నాలేంటి? ఏంది మనకి ఈ కర్మ" అని సొంత పార్టీ వాళ్లే తలలు పట్టుకుని వెనక్కి వచ్చేస్తున్నారు. ఇదీ ఈరోజు వైసీపీ పరిస్థితి.

# బుల్లెట్ ప్రూఫ్ వాహనం వెనక్కి

**- భద్రతా వ్యవస్థ కుదింపు సొంత వాహనంలోనే నియోజకవర్గ పర్యటనలు: ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్ ) ప్రధాని నరేంద్ర మోదీ ఇంధన పొదుపుపై ఇచ్చిన పిలుపు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచిస్తున్న బాధ్యతాయుత విధానాలకు అనుగుణంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తన కాన్వాయ్‌ను తగ్గించుకున్నారు. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకూడదన్న ఉద్దేశంతో తనకు కల్పించిన వై-కేటగిరీ భద్రతలో భాగంగా ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని వినియోగించవద్దని నిర్ణయించి, ఆ వాహనాన్ని పోలీస్ శాఖకు తిరిగి పంపించారు. అదేవిధంగా 2o2 గన్‌మెన్ల స్థానంలో 1o1 భద్రతా సిబ్బంది సరిపోతారని సూచిస్తూ సెక్యూరిటీ వ్యవస్థను కూడా కుదించుకున్నారు. గ్రీన్ ఛానల్ సౌకర్యాలను వినియోగించకుండా, అధిక ఎస్కార్ట్ వాహనాలకు దూరంగా ఉంటూ తన సొంత వాహనంలోనే నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సూచించారని గుర్తుచేశారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ దుబారా ఖర్చులు తగ్గించి పొదుపు అలవాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచనలు మేరకు ప్రజలందరూ భాద్యతయాయుతంగా వ్యవహరించాలి. "నా దేశం--నా బాధ్యత" అనే భావన ప్రతి ఒక్కరిలో రావాలని సీఎం ఇచ్చిన పిలుపు స్ఫూర్తితోనే తాను కూడా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి ఏటా తెలుగుదేశం పార్టీ ఎంతో ఘనంగా నిర్వహించే మహానాడును కూడా ఈసారి సాంకేతిక వినియోగానికి ప్రాధాన్యం ఇస్తూ ఈ-డిజిటల్, ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్ ద్వారా మహానాడుగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి
# కూటమి ప్రభుత్వం పెద్దపీట

**- వేట విరామానికి సీఎం భరోసా ఆర్థిక సాయం రూ.20 వేలకు పెంపు -- ఎమ్మెల్యే గౌతు శిరీష**




పలాస (ప్రశ్న న్యూస్) ప్రజా శ్రేయస్సు, పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. మత్స్యకారుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న సంక్షేమ నిర్ణయాలు వారికి ఆర్థికంగా బలాన్నిస్తాయని ఆమె తెలిపారు. వేట విరామ సమయంలో ఉపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలకు అండగా నిలిచేందుకు "సీఎం భరోసా" పథకం కింద అందించే ఆర్థిక సహాయాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచడం ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే గౌతు శిరీష కొనియాడారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.3 లక్షల మంది మత్స్యకార కుటుంబాలకు ఈ పథకం ద్వారా నేరుగా లబ్ధి చేకూరుతుందని ఆమె తెలిపారు. సముద్రంలో వేట నిషేధం అమలులో ఉన్న సమయంలో మత్స్యకారులు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని, అలాంటి సమయంలో ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక భరోసా వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కష్టజీవుల పక్షాన నిలుస్తూ వారి అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందని ఆమె స్పష్టం చేశారు.శ్రీకాకుళం కలెక్టరేట్‌లో నిర్వహించిన "మత్స్యకారులకు వేటవిరామానికి సీఎం భరోసా" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, సహచర ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారికి ఆర్థిక భద్రత కల్పించడం, కుటుంబాలకు స్థిరత్వం ఇవ్వడం లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే వివరించారు. రాష్ట్ర అభివృద్ధిలో మత్స్యకారుల పాత్ర ఎంతో కీలకమని, వారి సంక్షేమం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, జిల్లా అధికార యంత్రాంగం, మత్స్యకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ చర్యల పట్ల మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా నర్సింగ్ రాజ్ జన్మదిన వేడుకలు



**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** గుట్ట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి గౌళికార్ నర్సింగ్ రాజ్ జన్మదిన వేడుకలు మంగళవారం స్థానిక సింహద్వారం వద్ద ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సీపీ నేత వడ్లోజు వెంకటేష్ ఆధ్వర్యంలో అన్నదానం,మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థిని పడిగెల నిహారికకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మాధవ సేవే మానవ సేవ అని, నర్సింగ్ రాజ్ ఎదిగిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గౌళికార్ అరుణ రాజేష్, మాజీ వార్డు సభ్యులు కరణ్ లాల్, వడ్లోజు శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## 14వ వార్డులో ఉచిత
# యోగ శిబిరం కొనసాగింపు

**- 10వ రోజుకు చేరుకున్న యోగ కార్యక్రమం**

**- యోగ సభ్యులకు మజ్జిగ పంపిణీ చేసిన సామ ప్రశాంతి**



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని 14వ వార్డులో భారత్ నగర్ వినాయక మండపం వద్ద నిర్వహిస్తున్న ఉచిత యోగ శిబిరం ఈరోజుతో 10వ రోజుకు చేరుకుంది. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు యోగ గురువు దేవసాని అనిత, కౌన్సిలర్ గుంటుకు లక్ష్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించబడుతోంది.వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సోషల్ అక్టివిస్టు సామ ప్రశాంతి యోగ శిబిరంలో పాల్గొంటున్న సభ్యులు, చిన్నారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ సభ్యులు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు.యోగాభ్యాసంతో పాటు చిన్నారులు భగవద్గీత శ్లోకాలను శ్రావ్యంగా ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. అలాగే క్లాసికల్ డాన్స్ ప్రదర్శనలు నిర్వహించి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఆరోగ్యకర జీవనశైలికి యోగ ఎంతో అవసరమని నిర్వాహకులు తెలిపారు. మహిళలు, యువత, పిల్లలు ఉత్సాహంగా పాల్గొంటూ శిబిరాన్ని విజయవంతం చేస్తున్నారు.

# వైసిపి ప్రజలను తప్పుదోవ పట్టించే నిరసనలు మానుకోవాలి

**- ఆర్టీసీ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు.**

**- వైసీపీ నిరసనలు ప్రజా సమస్యల కోసం కావు.శ్రీ**

**- ప్రస్తుతం ధరలు పెంచింది రాష్టం కాదు కేంద్రమే**



**ఏలూరు(ప్రశ్న న్యూస్)** వైసిపి నాయకులు ఏ సమయంలో ఏ అంశంపై నిరసనలు తెలియజేయాలో కనీస రాజకీయ అవగాహన కూడా కోల్పోయారని జనసేన ఏలూరు ఇన్చార్జిరెడ్డి అప్పలనాయుడు విమర్శించారు. మంగళవారం ఏలూరు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్న తొలి రెండేళ్లలోనే పెట్రోల్ డీజిల్ ధరలపై సుమారు 31 రూపాయి వరకు భారం పెంచి ప్రజలపై అదనపు భారాన్ని మోపారని ఆరోపించారు. రోడ్డు సెస్ పేరుతో లీటరుకు రూపాయి అదనపు భారం విధించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. కరోనా సమయంలో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు పెట్రోల్ డీజిల్ పై పన్నులు తగ్గించి ప్రజలకు ఊరటను కల్పించినప్పటికీ, అప్పటి ఆంధ్రప్రదేశ్ లో వైకాపా ప్రభుత్వం మాత్రం ప్రజలపై భారం తగ్గించే చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు ధరలను తగ్గించిన సమయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా తగ్గించలేదని ఆరోపించారు. ప్రస్తుతం ఇంధన ధరలు, పెరుగుదల అంతర్జాతీయ పరిణామాలు ముఖ్యంగా ఇరాన్ యుద్ధ పరిస్థితుల కారణంగా ధరలు పెరగడం సరఫరా వ్యవస్థ పై ప్రభావం పడడం వల్లే జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో వైసీపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయడం తగదని, ప్రజా సమస్యల పేరుతో రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూడడం సరికాదని విమర్శించారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసే ఆందోళన చేపడితే ప్రజలే తగిన సమాధానం చెబుతారని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. రాష్ట్రంలో వైసిపి చేపడుతున్న నిరసనలు ప్రజాప్రయోజనాలు కోసం కాకుండా, వైసిపి పార్టీ రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో భాగమేనని ఆయన పేర్కొన్నారు. గత పాలనలో ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేసిన వైసిపి ప్రభుత్వం ఇప్పుడు ధరల పెరుగుదలపై నిరసనలకు పిలుపునివ్వడం, రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అప్పలనాయుడు విమర్శించారు. 2019 నుండి 2024 మధ్యకాలంలో పలుమార్లు ఇంధన ధరలు పెరిగినప్పుడు స్పందించని వైసీపీ కీ, ఇప్పుడు ధరల అంశంపై మాట్లాడే నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో చోటు చేసుకున్న ధరల మార్పులు రాష్ట్ర ప్రభుత్వ కారణాల వల్ల కాకుండా అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులు ప్రపంచ ఆర్థిక పరిణామాల ప్రభావంతో కేంద్ర స్థాయిలో తీసుకున్న నిర్ణయాల ఫలితము అని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధంలేని అంశాలపై ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తామని ప్రకటించడం, వైసిపి రాజకీయ దిగజారుడుతనాన్ని సూచిస్తుందని ఆరోపించారు. ప్రజా మద్దతు కోల్పోయిన నేపథ్యంలో రాజకీయ ప్రాధాన్యత కోసం అనవసర ఆందోళన చేపట్టాలని ప్రయత్నించడం, ప్రజలు అంగీకరించే పరిస్థితి లేదన్నారు. దేశవ్యాప్తంగా ఆర్థిక సవాళ్లు నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో, రాష్ట్రాన్ని స్థిరంగా ముందుకు తీసుకు వెళ్లేందుకు కూటమి ప్రభుత్వం దూరదృష్టితో పనిచేస్తుందని అప్పలనాయుడు పేర్కొన్నారు. ఈ సమయంలో ఆధార రహిత ఆరోపణలు, రాజకీయ విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు మానుకోవాలని వైసిపి నాయకత్వానికి సూచించారు. ప్రస్తుతం ధరల పెంపు బాధాకరమైనప్పటికీ గతంలో ప్రజలపై అధిక భారం మోపిన వైసిపి నేతలు, ఇప్పుడు ధర్నాలు చేయడం సిగ్గుచేటని, సమంజసం కాదని, వైసిపి నాయకులకు నైతిక హక్కు లేదని రెడ్డి అప్పలనాయుడు విమర్శించారు. మీడియా సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ కావూరి వాణిశ్రీ,రాష్ట్ర చేనేత కార్యదర్శి దోనేపూడి లోవరాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ గుప్తా, నగర అధ్యక్షులు వీరంకి పండు, అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, నాయకులు సరిది రాజేష్, బొత్స మధు, రెడ్డి గౌరీశంకర్, ఎట్రించి ధర్మేంద్ర, బోండా రాము నాయుడు, బెజవాడ నాగభూషణం కుమార్, జనసేన రవి, కొండల ప్రసాద్, కన్న ప్రసాద్, వాసా సాయి తదితరులు పాల్గొన్నారు.

# 23న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరిగుట్టకు రాక

**- 100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**- ఈనెల 22న యాదగిరిగుట్టను సందర్శించనున్న కంచి పీఠాధిపతి శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి**






**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు ఈనెల 23న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం కార్యనిర్వాహణాధికారి భవానీ శంకర్ తెలిపారు. 100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. మంగళవారం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 23న ఉదయం 9 గంటల 27 నిమిషాలకు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుంటారని అనంతరం, టెంపుల్ సిటీ నందు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వేద పాఠశాల శంకుస్థాపన కార్యక్రమంలో కంచి పీఠాధిపతి శ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో పాల్గొంటారని అనంతరం ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుంది తెలిపారు. దేవస్థానం కొండపైన నూతనంగా కళ్యాణమంటపం, దీక్షాపరుల సదనం,కొండ కింది నుండి కొండపై వరకు మెట్ల దారి వెంట పైకప్పు షెడ్డును నిర్మించడం, పిఆర్ఓ ఆఫీస్ ఎదురుగా నూతనంగా మాడవీధులకు వెళ్ళేందుకు మెట్ల మార్గం (ఎక్సలేటర్) సదుపాయం ను పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కంచి పీఠాధిపతి శంకరా విజయేంద్ర సరస్వతి పాల్గొంటారని తెలిపారు. కంచి పీఠాధిపతి శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి వారు ఈనెల 22న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు రానున్నారని తెలిపారు. శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి వారు ఈనెల 22వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి విచ్చేయుచున్నారని 4 గంటల నుండి 4: 45 నిమిషాల వరకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న అనంతరం కొండపైన కళావేదిక వద్ద సాయంత్రం 6 గంటలకు భజన కార్యక్రమంలో పాల్గొంటారని,32 మంది చతుర్వేద పారాయణం అనంతరము విజయేంద్ర సరస్వతి వారు ప్రసంగం ఉంటుందని ఈ కార్యక్రమానికి భక్తులు స్థానికులు అధిక సంఖ్యలో రావాలని ఈ ఓ భవాని శంకర్ తెలిపారు.

## ఎం ఎం సి మున్సిపల్ కార్పొరేషన్‌లో

# అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన

**- ఏప్రిల్ జీతాలు ఇంకా ఇవ్వలేదు.. ఆకలితో అలమటిస్తున్న కార్మిక కుటుంబాలు**

**- ఉన్నత అధికారులకు విన్నవించిన పట్టించుకోని వైనం**




హైదరాబాదు (ప్రశ్న న్యూస్) అసలే తక్కువ జీతాలు సరిపోవట్లేదు అవి కూడా 1వ తేదీన ఇవ్వక ఉద్యోగులను వీధిన పడేస్తున్న అధికారులు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నెల కిరాయిలు, పిల్లల ఫీజులు, అప్పుల ఒత్తిడితో కార్మికుల జీవితాలు చితికిపోతున్న వైనం ఎం ఎం సి మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పటికే అతి తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికులకు ఇప్పటికీ ఏప్రిల్ నెల జీతాలు ఇప్పటికి అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నెలలు గడుస్తున్నా జీతాలపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం కార్మికుల్లో ఆందోళన, అయోమయాన్ని మరింత పెంచుతోంది. పగలు రాత్రి తేడా లేకుండా నగర పరిశు భ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, కార్యాలయ సేవలు, ఫీల్డ్ పనులు నిర్వహిస్తూ మున్సిపల్ వ్యవస్థను నడిపిస్తున్న అవుట్సోర్సింగ్ ఉద్యోగుల పట్ల అధికారుల నిర్లక్ష్యం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. పని మాత్రం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే చేయించుకుంటూ జీతాలు మాత్రం సమయానికి ఇవ్వకపోవడం దారుణమని ఉద్యోగులు మండిపడుతున్నారు.

ఇప్పటికే పెరిగిన ధరలు, ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులతో అవుట్సోర్సింగ్ సిబ్బంది సతమతమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నెల జీతం కూడా అందకపోవడంతో అనేక కుటుంబాలు అప్పుల బారిన పడుతున్నాయి. కొంతమంది ఉద్యోగులు ఇల్లు కిరాయిలు కట్టలేక ఇల్లు యజమానుల ఒత్తిడిని ఎదుర్కొంటుండగా, మరికొందరు పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేక అవమానాలు పడుతున్నారు.

చేతిలో రూపాయి లేక భోజనానికి కూడా ఇబ్బంది పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పని చేయించుకోవడంలో అధికారులు ముందుంటారు. కానీ జీతాలు ఇవ్వడంలో మాత్రం బాధ్యత తీసుకోరు. నెల మొత్తం కష్టపడి పనిచేసినా జీతం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. బ్యాంక్ లోన్స్, చిట్టీలు, ఇంటి కిరాయిలు అన్నీ పెండింగ్‌లో ఉన్నాయి, అంటూ పలువురు అవుట్సోర్సింగ్ ఉద్యోగులు వాపోతున్నారు.కార్మికుల చెమటతో నడుస్తున్న మున్సిపల్ వ్యవస్థలో వారిని ఇంతలా నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కోట్ల రూపాయల బడ్జెట్లు, భారీ ప్రాజెక్టులు, అధికారుల హంగామా మధ్య నిజంగా కష్టపడే కార్మికులకు మాత్రం కనీస వేతనం కూడా సమయానికి ఇవ్వలేని పరిస్థితి ఎందుకు వచ్చిందని మండిపడుతున్నారు.జీతాల ఆలస్యానికి కారణాలేమిటో స్పష్టంగా చెప్పకుండా అధికారులు కాలయాపన చేయడం పట్ల ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అవుట్సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలు తీవ్రరూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ కమిషనర్లు, ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న ఏప్రిల్ నెల జీతాలను వెంటనే విడుదల చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. కష్టపడి పనిచేసే కార్మికుల కుటుంబాలు ఆకలితో అలమటించే పరిస్థితి రావడం ప్రభుత్వ యంత్రాంగానికి మచ్చగా మారుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఏసీబీ వలలో జలమండలి

# అవినీతి తిమింగలం

**- రూ.1.10 కోట్ల నగదు, కేజీ బంగారం స్వాధీనం**

**- రోజుకు రూ. 50 వేలు టార్గెట్, రూ. 100 కోట్లకు పైగా అక్రమాస్తులు**

**- హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో 8 చోట్ల ఏకకాలంలో సోదాలు**

**- మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.100 కోట్లు ఉండొచ్చని అధికారుల అంచనా**







హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో భారీ అవినీతి తిమింగలం చిక్కింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ (జలమండలి) జనరల్ మేనేజర్ సగ్గం అనంత లక్ష్మి కుమార్ (ఎస్ఏఎల్ కుమార్)పై ఏసీబీ అధికారులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారు. అయితే కుమార్ లక్ష్యంగా జరిపిన సోదాల్లో ఏసీబీ బృందాలు భారీగా అక్రమాస్తులను గుర్తించాయి. ఇందుకు సంబంధించి ఇంకా సోదాలు కొనసాగుతున్నాయి. అయితే ఈ క్రమంలోనే కుమార్ ఆదాయానికి సంబంధించి షాకింగ్ విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

జలమండలి జీఎం కుమార్ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై ఏసీబీ అధికారులు దృష్టిసారించారు. హైదరాబాద్‌లోని మల్లాపూర్ ప్రాంతంలో ఉన్న కుమార్ ఇంటితో సహా రాష్ట్రంలోని ఎనిమిది ప్రదేశాలలో ఏకకాలంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మల్లాపూర్‌లోని కుమార్‌కు చెందిన జీ౦3 ఇంటితో పాటు, హైదరాబాద్‌లోని అతని కార్యాలయం, స్నేహితులు, బంధువుల ఇళ్లు, నిజామాబాద్‌లోని అతని ఫామ్‌హౌస్‌లలో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు.

ఈ క్రమంలోనే కుమార్‌కు సంబంధించి భారీగా ఆస్తులు గుర్తించారు. ఈ సోదాల్లో భారీగా నగదు, భారీ పరిమాణంలో బంగారం, వెండి ఆభరణాల, ఇతర ఆస్తులను గుర్తించారు. సోదాల సమయంలో అధికారులు కుమార్‌కు చెందిన పలు ఆస్తి పత్రాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. వీటిలో హైదరాబాద్‌లో ఒక నివాసం, ఒక గేటెడ్ కమ్యూనిటీలో మూడు ఫ్లాట్లు, నగర శివార్లలో ఆరు ఖాళీ స్థలాలు ఉన్నట్టుగా గుర్తించారు. అలాగే నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో 18 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు అధికారులు కనుగొన్నారు. ఈ సోదాల సందర్భంగా ఏసీబీ బృందాలు 2.1 కిలోల బంగారం, 9.2 కిలోల వెండి వస్తువులు గుర్తించారు. ఓ కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఆస్తుల విలువ దాదాపు రూ.5.88 కోట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశముంది.

అయితే ఈ సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. అదనపు ఆస్తులపై విచారణ కొనసాగుతోందని ఏసీబీ తెలిపింది. ఇక, ఎస్ఏఎల్ కుమార్‌పై అవినీతి నిరోధక చట్టం కింద ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఎస్ఏఎల్ కుమార్ దాదాపు రూ. 100 కోట్ల విలువైన ఆస్తులను కూడబెట్టినట్లు అనుమానిస్తున్నారు. అయితే ఏసీబీ వర్గాల ప్రకారం ఎస్ఏఎల్ కుమార్ ఈ స్థాయిలో అక్రమాస్తులను సంపాదించేందుకు వివిధ పద్ధతులను పాటించినట్టుగా తెలుస్తోంది. రోజుకు రూ. 50 వేలు టార్గెట్‌గా పెట్టుకుని అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్టుగా సమాచారం. వాటర్ ట్యాంకర్లను అధిక ధరకు అమ్మి రోజుకు రూ. 50,000 సంపాదించేవారని తెలుస్తోంది. అపార్ట్‌మెంట్ల కోసం ఒక్కో ట్యాంకర్‌కు రూ. 5000 వసూలు చేసేవారని ఇందులో చాలా ట్యాంకర్లు అనధికారికంగా బుక్ చేసినట్టుగా సమాచారం. ఇక, కుమార్ సర్వీస్ 25 ఏళ్లు కాగా ప్రస్తుతం జలమండలిలో రెడ్ హిల్స్ ప్రాజెక్ట్ డివిజన్-ఎ××× జనరల్ మేనేజర్ (ఇంజనీరింగ్)గా చేస్తున్నారు.



## స్విచ్‌లు నొక్కడం తప్ప జగన్ చేసిందేమీ లేదు

**- వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారన్న షర్మిల**




అమరావతి (ప్రశ్న న్యూస్) వైసీపీ అధినేత, తన సోదరుడు జగన్ పై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారని ఆమె ధ్వజమెత్తారు. వైఎస్సార్ పేరు చెప్పుకుని 'ఒక్క ఛాన్స్' అంటూ సీఎం అయిన జగన్, ఐదేళ్ల పాలనలో కేవలం స్విచ్‌లు నొక్కడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కేవలం బటన్లు నొక్కితే మళ్లీ మళ్లీ సీఎంలు కాలేరని, కనీసం ఎమ్మెల్యేలు, ఎంపీలకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వని పరిస్థితి నాడు ఉందని మండిపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తండ్రి ఆశయాల పేరిట ఓట్లు వేయించుకుని, అధికారంలోకి వచ్చాక ఆ ఆశయాలనే జగన్ నాశనం చేశారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో ప్రజలపై భారాలు మోపిన వైసీపీ నేతలు, ఇప్పుడు ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. జగన్ సీఎం అయ్యాక కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తల ఊపుతూ, అక్రమ పొత్తు పెట్టుకున్నారని షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు.

## బండి సంజయ్ రాజీనామా

## చేయాలనడం సరికాదు

**- కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బండి సంజయ్‌ని కేంద్రమంత్రి పదవి నుంచి దించాలని, రాజీనామా చేయించాలని సొంత పార్టీ ఎంపీలే ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ మల్లు రవి అన్నారు. కానీ అది మంచి పద్ధతి కాదని అన్నారు. ఆయనను పదవిలో నుంచి దించేస్తే తాము వస్తామని కొందరు భావిస్తున్నారని ఆరోపించారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కుమారుడు బండి భగీరథ్ తప్పు చేస్తే బండి సంజయ్ మంత్రి పదవికి రాజీనామా చేయాలనడం సరికాదని అన్నారు. బండి సంజయ్ తన కుమారుడిని దాచిపెట్టకుండా చట్టానికి లొంగిపోయేలా చేసి బాధ్యతాయుతంగా వ్యవహరించారని కితాబిచ్చారు. మద్యం పాలసీ కేసులో కవిత జైలుకు వెళ్ళినప్పుడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. ఇలాంటి అంశాల్లో పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. పిల్లలు అన్నాక తప్పు చేస్తారని, కానీ దానిని రాజకీయం చేయడం సరికాదని అన్నారు. బండి సంజయ్ తన కుమారుడిని దాచిపెట్టకుండా సరెండర్ చేశారని గుర్తు చేశారు.

## చెక్ బౌన్స్ కేసులో

## నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష



ఘట్‌కేసర్( ప్రశ్న న్యూస్) చెక్ బౌన్స్ కేసులో నిందితుడు డొంకని నగేష్ గౌడ్‌కు ఆరు నెలల సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.6 లక్షలు చెల్లించాలని నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. కిరణ్ కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. ఘట్‌కేసర్ మండలం ఔషాపూర్ గ్రామానికి చెందిన డొంకని నగేష్ గౌడ్ 2014లో మౌలాలికి చెందిన గున్నాల అరుణ్ కుమార్ వద్ద రూ.3 లక్షలు అప్పుగా తీసుకుని, అందుకు సంబంధించి చెక్కును అందజేశాడు. అయితే ఆ చెక్కు బ్యాంకులో జమ చేయగా బౌన్స్ అయింది. అనంతరం నగేష్ గౌడ్ చెల్లింపులో కాలయాపన చేయడంతో బాధితుడు గున్నాల అరుణ్ కుమార్ న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఈ కేసులో 2022 మార్చి 7న 19వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పూజా కందుకూరి నిందితుడికి శిక్ష విధించారు. ఆ తీర్పును సవాల్ చేస్తూ డొంకని నగేష్ గౌడ్ జిల్లా కోర్టులో అప్పీల్ దాఖలు చేశాడు. అప్పీల్‌ను విచారించిన నాల్గవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి డి. కిరణ్ కుమార్, నిందితుడి అప్పీల్‌ను కొట్టివేస్తూ ట్రయల్ కోర్టు తీర్పును సమర్థించారు. దీంతో నగేష్ గౌడ్‌కు ఆరు నెలల సాధారణ జైలు శిక్షను ఖరారు చేశారు. అలాగే, చెక్కు మొత్తం రూ.3 లక్షలకు రెట్టింపుగా రూ.6 లక్షలు చెల్లించాలని, 2014 నుంచి అసలు మొత్తంపై సంవత్సరానికి 9 శాతం వడ్డీ చెల్లించాలని కోర్టు ఆదేశించింది. నిందితుడు వచ్చే నెల జూన్ 19లోపు ట్రయల్ కోర్టులో లొంగిపోవాలని, లేనిపక్షంలో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసి అరెస్ట్ చేసి జైలుకు తరలించాలని ట్రయల్ కోర్టుకు ఆదేశాలు జారీ చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588